ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
తమిళనాడు
TAMILNADU
ఆదివారం 5 జనవరి 2025

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక
ఆంధ్రజ్యోతి దిన పత్రిక కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు, ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఏవైనా సమస్యలుంటే క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.
A.C.O - 9003200801
S.R - 9551168092
27/11, సౌందరరాజన్ స్ట్రీట్, టి.నగర్, చెన్నై-600017



జల్లికట్టు దృశ్యం

రంకేసిన తొలి జల్లికట్టు

తచ్చంకుర్చిలో కోలాహలం



విజేతలకు బహుమతులు పంపిణీ చేస్తున్న రాష్ట్ర మంత్రులు రఘుపతి, మెయ్యనాథన్

ప్యారీస్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సంప్రదాయ, సాహస జల్లికట్టు పోటీలను శనివారం పుదుకోట జిల్లా తచ్చంకుర్చిలో రాష్ట్ర న్యాయ శాఖ మంత్రి ఎస్.రఘుపతి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి వి.మెయ్యనాథన్ జెండా ఊపి ప్రారంభించారు. జిల్లా కలెక్టర్ ఎం.అరుణ నేతృత్వంలో ఎద్దులను నిలువరించేందుకు గుర్తింపుకార్డులు కలిగిన వీరులతో ప్రతిజ్ఞ చేయించారు. ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఉదయం 8 గంటలకు వాడివాసల్ మీదుగా తచ్చంకురిచ్చి ఆలయ ఎద్దు మైదానంలో రంకెలేస్తూ పరుగులు తీసింది. ఈ ఏడాదిలో రాష్ట్రంలో నిర్వహించిన తొలి జల్లికట్టు కార్యక్రమం ఇదే కావడంతో రాష్ట్రం నలు మూలల నుంచే కాకుండా, స్వదేశీ, విదేశీ పర్యాటకులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి ఈ పోటీలను ఆసక్తిగా వీక్షించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రప్రభుత్వం సహకరించడంతో పాటు అనుమతిని జారీ చేసింది. పుదుకోట జిల్లాలో అత్యధిక సంఖ్యలో జల్లికట్టు కార్యక్రమాలు నిర్వహిస్తారు. అంతేకాకుండా ఎద్దుల బండ్ల పోటీల ప్రధాన పండుగ సీజన్‌లో ఏర్పాటు చేస్తారు. ఈ నేపథ్యంలో శనివారం తచ్చంకుర్చిలో నిర్వహించిన జల్లికట్టులో తిరుచ్చి, దిండుగళ్, శివగంగ, మనప్పారై, పుదుకోట జిల్లాల నుంచి 600పైగా ఎద్దులు పాల్గొన్నాయి. సుమారు 320 మందికి పైగా యువకులు రంకెలేస్తూ పరుగులు తీసిన ఎద్దులను నిలువరించేందుకు పోటీ పడ్డారు. రాష్ట్రప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల మేరకు పశు సంవర్ధక శాఖ వైద్యులు ముందుగానే జల్లికట్టు ఎద్దులు, యువకులకు వైద్యపరీక్షలు నిర్వహించి గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. ఇదిలా ఉండగా గాయపడిన యువకులను, ప్రజలను వెంటనే ఆస్పత్రికి తరలించేందుకు ఆరోగ్యశాఖ అధికారులు అంబులెన్సులను అందుబాటులో ఉంచారు. అలాగే ప్రథమ చికిత్సలను అందించారు. రెవెన్యూ, అగ్నిమాపక, పోలీసు తదితర శాఖల అధికారులు కలిసి కట్టుగా ఈ పోటీలు నిర్వహించేందుకు సహకరించారని జల్లికట్టు నిర్వాహకులు తెలిపారు. పలు రౌండ్లుగా సాగిన ఈ పోటీలో విజేతలకు, ఎవరికి పట్టుబడిన ఎద్దుల యజమానులకు విలువైన బహుమతులు పంపిణీ చేసి అభినందించారు.

అత్యాచారం కేసులో కొనసాగుతున్న దర్యాప్తు

- రాజకీయం చేయొద్దు: ఎంపీ కనిమొళి
- అవాస్తవాల ప్రసారం : రాష్ట్ర ప్రభుత్వం

ప్యారీస్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక గిండిలోని అన్నా వర్సిటీలో విద్యార్థినిపై అత్యాచారానికి పాల్పడిన కేసులో రెండో వ్యక్తి ప్రమేయముందని పోలీసులు అనుమానిస్తున్నారు. అన్నావర్సిటీలో బీఈ సెకండియర్ చదువుతున్న విద్యార్థిని రాత్రిపూట తన ప్రియుడితో కలిసి ఆ ప్రాంగణంలో వుండగా, ఓ వ్యక్తి అత్యాచారానికి పాల్పడిన విషయం తెలిసిందే. ఈ కేసులో జ్ఞానశేఖరన్ అనే వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. అంతేగాక నిందితుడి నుంచి సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఈ కేసు దర్యాప్తుకు హైకోర్టు ప్రత్యేక సిట్‌ను ఏర్పాటు చేసింది. ఈ దర్యాప్తు బృందం విచారణ ప్రారంభించింది. జ్ఞానశేఖరన్ సెల్ ఫోన్ డేటాను కూడా క్షుణ్ణంగా పరిశీలిస్తోంది. కాగా ఈ అత్యాచార ఘటనలో రెండో వ్యక్తి ప్రమేయం కూడా వున్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

అత్యాచారంపై రాజకీయాలా?

అన్నావర్సిటీ విద్యార్థిని అత్యాచార వ్యవహారాన్ని రాజకీయంగా చూడరాదని డీఎంకే ఎంపీ కనిమొళి ప్రతిపక్ష పార్టీలను కోరారు. ఆమె శనివారం మీడియాతో మాట్లాడుతూ... అత్యాచార కేసులో పోలీసులు తక్షణ చర్యలు చేపట్టి నిందితుడిని అరెస్టు చేశారని, ప్రస్తుతం కోర్టులో ఉన్న ఈ కేసులో నిందితుడికి కఠిన శిక్షపడితేనే బాధితురాలికి న్యాయం జరుగుతుందన్నారు. అత్యాచార ఘటనను అన్ని పార్టీలు ఖండించాయని, తాను కూడా ట్విట్టర్లో ఖండించినట్లు తెలిపారు. నిందితుడ్ని అరెస్టు చేసిన తర్వాత కూడా ప్రతి పక్షాలు రాజకీయ లబ్ధి కోసం రాష్ట్రప్రభుత్వంపై బురద చల్లే విధంగా వ్యవహరించడం సరికాదన్నారు. ఎఫ్ఐఆర్ విడుదలకు రాష్ట్రప్రభుత్వంపై నిందమోపారని, కానీ సాంకేతిక లోపమే దీనికి కారణమని జాతీయ సమాచార కేంద్రం కూడా స్పష్టం చేసిందని కనిమొళి తెలిపారు.

అవాస్తవాల ప్రసారం వద్దు

స్థానిక గిండి అన్నా వర్శిటీ ప్రాంగణంలో ఇంజనీరింగ్ విద్యార్థినిపై జరిగిన అత్యాచార వ్యవహారంలో అవాస్తవాలు ప్రసారం చేయరాదని రాష్ట్ర ప్రభుత్వం సామాజిక మాధ్యమాలకు స్పష్టం చేసింది. శనివారం రాత్రి ఈ మేరకు సచివాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. మద్రాసు హైకోర్టు ఉత్తర్వుల మేరకు అన్నా వర్శిటీ విద్యార్థినిపై జరిగిన వేధింపుల కేసు దర్యాప్తు నిమిత్తం ప్రభుత్వం సిట్‌ను నియమించిందని, ఈ ప్రత్యేక దర్యాప్తు కమిటీ ప్రస్తుతం విచారణ వేగవంతం చేసిందని, విచారణకు సంబంధించిన ఎలాంటి వివరాలు సిట్ ప్రకటించలేదని పేర్కొంది. అయినప్పటికీ, సామాజిక మాధ్యమాల్లో సిట్ దర్యాప్తు గురించిన అంశాలు ప్రసారమవుతున్నాయని, అత్యాచార వ్యవహారంలో తిరుప్పూర్‌కు చెందిన ఓ వ్యక్తికి సంబంధాలున్నట్లు సిట్ తెలిపినట్లు వస్తున్న వార్తల్లో ఎలాంటి ఆధారాలు లేవని తెలిపింది. ఇలాంటి అవాస్తవాలు ప్రసారం, పోస్టు చేసే సంస్థలకు చర్యలు చేపడతామని ప్రభుత్వం హెచ్చరించింది. కాగా, ఇలాంటి హెచ్చరికలను డీజీపీ కార్యాలయం కూడా జారీ చేయడం గమనార్హం.



బుగ్గిపాలైన బతుకులు



మృతులు కామరాజ్, కన్నన్, మీనాక్షి సుందరం, నాగరాజ్, శివ కుమార్, వేల్ మురుగన్

బాణసంచా కర్మాగారంలో పేలుడు ● ఆరుగురి బలి

- ఒకరికి గాయాలు
- ఆర్థిక సాయం ప్రకటించిన సీఎం

చెన్నై, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): బాణసంచా కర్మాగారంలో శనివారం ఉదయం సంభవించిన పేలుడులో ఆరుగురు కార్మికుల ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. శివకాశి సమీపంలోని ఆలమరత్తుపట్టికి చెందిన బాలాజి విరుదునగర్ జిల్లా కోడయూరులో 'సాయినాథ్ ఫైర్ వర్క్స్' పేరుతో బాణసంచా కర్మాగారం నడుపుతున్నారు. ఆ కర్మాగారంలో 84 గదులున్నాయి. ఇక్కడ ప్రతిరోజూ 150 మందికి పైగా కార్మికులు పని చేస్తుంటారు. శనివారం ఉదయం 84 మంది కార్మికులు హాజరయ్యారు. ఉదయం 9.40 గంటల ప్రాంతంలో బాణసంచా తయారీ కోసం రసాయనాలు కలుపుతుండగా హఠాత్తుగా భారీ శబ్దంతో పేలుడు సంభవించింది. దీంతో మిశ్రమాలు భద్రపరచిన గది సహా నాలుగు గదులు నేలమట్టమయ్యాయి. సమాచారం అందుకున్న విరుదునగర్, శివకాశి, సాత్తూరు నుంచి అగ్నిమాపక దళం సభ్యులు ఫైరింజన్లతో హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని తీవ్రంగా కృషి చేసి, మంటలను ఆర్పారు. అనంతరం ఎక్స్‌కవేటర్లతో శిథిలాలను తొలగించారు. శిథిలాల కిందపడి వేల్‌మురుగన్ (54), కామరాజ్ (54), శెట్టికుచ్చికి చెందిన నాగరాజ్ (37), వీరర్‌పట్టికి చెందిన కన్నన్(54), అరుప్పుకోటకు చెందిన మీనాక్షి సుందరం (46), శివకుమార్(56) మృతి చెందారు. ఆవుడయార్‌పురానికి చెందిన మహమ్మద్ సుదీన్ తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని స్థానిక ఆస్పత్రిలో చేర్పించారు. ఈ ప్రమాదం జరిగిన వెంటనే ఆ కర్మాగారంలో పని చేస్తున్న ఫోర్‌మేన్ పాండ్యరాజ్, ప్రకాష్ తదితరులు పారిపోయారు.

నిబంధనల అతిక్రమణ వల్లే...

ప్రమాదానికి గురైన సాయినాథ్ బాణసంచా కర్మాగారం లైసెన్స్ బాలాజి అనే వ్యక్తి పేరుపై ఉండగా, నిబంధనలు అతిక్రమించి ఆ కర్మాగారాన్ని ఇతరులకు లీజుకు ఇచ్చినట్లు తెలిసింది. అంతేకాకుండా ఆ యజమాని ఏమాత్రం ముందస్తు అనుభవం లేని కార్మికులతో టపాకాయలు తయారు చేయిస్తున్నట్లు తెలుస్తోంది. తగిన భద్రతా పరికరాలు కూడా లేకుండా కార్మికులు రోజువారీ విధుల్లో పాల్గొనే వారని స్థానికులు తెలిపారు. ఈ కారణాల వల్లే పేలుడు సంభవించినట్లు పోలీసులు తెలిపారు.

ఈపీఎస్ ఆగ్రహం...

రాష్ట్రంలో బాణసంచా కర్మాగారాల్లో అగ్ని ప్రమాదాలు, పేలుళ్లు జరగడానికి ముఖ్య కారణంగా డీఎంకే ప్రభుత్వ నిర్లక్ష్యమేనని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈమేరకు ఎక్స్‌పేజీలో సందేశం వెలువరించారు. టపాకాయల కర్మాగారాలకు లైసెన్సులు మంజూరు చేసే విషయంలో భద్రతా విభాగం, అగ్నిమాపక దళం సభ్యులు క్షుణ్ణంగా పరిశీలనలు, తనిఖీలు జరపడం లేదని, ప్రస్తుతం టపాకాయలను ఉత్పత్తి చేస్తున్న కర్మాగారాల్లో సంబంధిత అధికారులు నెలసరి తనిఖీలు జరపటం లేదన్నారు. టపాకాయల కర్మాగారంలో పేలుడు సంభవించి ఆరుగురు కార్మికులు దుర్మరణం చెందడంపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేస్తూ తీవ్ర సంతాపం ప్రకటించారు. ఇకనైనా డీఎంకే ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని టపాకాయల తయారీ కర్మాగారాలలో భద్రతా విభాగం, అగ్నిమాపక దళం అధికారుల చేత తనిఖీలు చేయించాలని డిమాండ్ చేశారు. మృతులకు ఆర్థికసాయం ప్రకటిస్తే చాలునని పాలకులు భావించకూడదని, భవిష్యత్‌లో ఇలాంటి ప్రమాదాలు జరుగకుండా అడ్డుకోవడమే ప్రభుత్వ ప్రధాన బాధ్యత అని ఆయనపేర్కొన్నారు.

మృతుల కుటుంబానికి రూ.4లక్షలు...

విరుదునగర్ జిల్లా కోడయూరు వద్ద బాణసంచా కర్మాగారం పేలుడులో ఆరుగురు మృతి చెందడం తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని సీఎం ఎంకే స్టాలిన్ పేర్కొన్నారు. ఈ మేరకు మృతుల కుటుంబీకులకు సంతాపం వ్యక్తం చేస్తూ ప్రకటన వెలువరించారు. మృతుల కుటుంబీకులకు తలా రూ.4లక్షల చొప్పున ఆర్థికసాయం ప్రకటించారు. ఇదే విధంగా మదురై రాజాజీ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహమ్మద్ సుదీన్‌కు రూ.లక్ష ఆర్థికసాయం అందించనున్నట్లు పేర్కొన్నారు.

నలుగురిపై కేసు నమోదు...

ఈ ప్రమాదానికి సంబంధించి కర్మాగారం యజమానులు బాలాజి, శశిబాలన్, మేనేజర్ దాస్, ఫోర్‌మేన్ ప్రకాష్‌పై వచ్చకారపట్టి పోలీసులు కేసు నమోదు చేశారు. అజాగ్రత్తగా వ్యవహరించి ప్రాణ నష్టం కలిగించారన్న సెక్షన్ సహా ఐదు సెక్షన్ల కింద వీరిపై కేసు నమోదు చేశారు.



శిథిలాలను తొలగిస్తున్న కార్మికులు

రాష్ట్రంలో అప్రకటిత ఎమర్జెన్సీ!

అన్నావర్శిటీలో అత్యాచారంపై సీబీఐ విచారణ ● గవర్నర్‌కు మహిళా మోర్చా వినతి



గవర్నర్‌కు వినతిపత్రం అందిస్తున్న మహిళా మోర్చా నాయకురాళ్లు

చెన్నై, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): అన్నా విశ్వవిద్యాలయంలో విద్యార్థినిపై జరిగిన అత్యాచారాన్ని ఖండిస్తూ మహిళామోర్చా నాయకురాళ్లు ఆందోళనలు జరిపేందుకు డీఎంకే ద్రావిడ తరహా ప్రభుత్వం అనుమతివ్వడం లేదని, ఈ పరిస్థితులను చూస్తే రాష్ట్రంలో అప్రకటిత ఎమర్జెన్సీ అమలవుతున్నట్లు అవగతమవుతోందని బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షురాలు డాక్టర్ తమిళిసై సౌందరరాజన్ ఆరోపించారు.శనివారం సాయంత్రం మహిళామోర్చా నాయకురాలు ఉమా రవి, ఆ పార్టీ జాతీయ కార్యాచరణ మండలి సభ్యురాలు ఖుష్బూ, సినీ నటి రాధిక, మాజీ ఎమ్మెల్యే విజయతరణి గిండిలోని రాజ్‌భవన్‌లో గవర్నర్ ఆర్ఎన్ రవిని కలుసుకుని వినతిపత్రం సమర్పించారు. అన్నా విశ్వవిద్యాలయంలో విద్యార్థినిపై జరిగిన అత్యాచారం కేసు విచారణను సీబీఐకి అప్పగించాలని కోరారు.

ఆ సార్... ఎవరో వెల్లడించండి : ఈ సందర్భంగా రాజ్‌భవన్ వెలుపల తమిళిసై మీడియాతో మాట్లాడుతూ.. అన్నావర్శిటీ ఉదంతంపై తాము వెలువరించిన అనుమానాలను గవర్నర్ ఓపిగ్గా విన్నారని చెప్పారు. ఆ విశ్వవిద్యాలయంలో సీసీ కెమెరాలు పనిచేయకపోడం, బాధితురాలికి ప్రత్యేక పరీక్షలు నిర్వహించకపోవడం వంటి విషయాలపై గవర్నర్ కూడా ఆందోళన వ్యక్తం చేశారని తెలిపారు. అత్యాచార ఘటనలో ప్రధాన నిందితుడు ఎవరితోనో మాట్లాడుతూ 'సార్.. సార్ అని పిలిచారని, ఆ సార్ ఎవరో వెల్లడించాలన్నదే తమ డిమాండ్ అని చెప్పారు.ఈఉదంతంపై సీఎం స్టాలిన్, ఉపముఖ్యమంత్రి ఉదయనిధి మౌనంపాటించడం గర్హనీయమన్నారు. మిత్రపక్షాలకు చెందిన వైగో, తిరుమావళవన్ వంటి నాయకులకు ఆందోళనలు జరిపేందుకు అనుమతులిచ్చిన డీఎంకే ప్రభుత్వం అత్యాచారం బాధితురాలికి మద్దతుగా మహిళా మోర్చా విభాగం జరుపతలపెట్టిన ఆందోళనలకు అనుమతి ఇవ్వకపోవడం చూస్తే రాష్ట్రంలో అప్రకటిత ఎమర్జెన్సీ ఉందని రుజువవుతోందన్నారు. అత్యాచార నేరస్థులకు ప్రభుత్వం అండగా ఉండటం వల్లే తాము సీబీఐ విచారణ కోరుతున్నామని చెప్పారు.

తానియా కుటుంబానికి ప్రభుత్వ గృహం

- తాళం అందజేసిన సీఎం స్టాలిన్



తానియా కుటుంబీకులకు తాళాన్ని అందిస్తున్న సీఎం స్టాలిన్

చెన్నై, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా వీరాపురం ప్రాంతానికి చెందిన చిన్నారి తానియా కుటుంబీకులకు సీఎం స్టాలిన్ రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ నిర్మించిన ఇంటిని కేటాయించారు. చెన్నై సచివాలయంలో శనివారం ఉదయం ఏర్పాటైన కార్యక్రమంలో తానియా తల్లిదండ్రులకు ఇంటి తాళాన్ని అందజేశారు. తిరువళ్లూరు జిల్లా విల్లివాక్కం పట్టణ పంచాయతీ పరిధిలోని వీరాపురంలో నివసిస్తున్న స్టీఫెన్, సౌభాగ్య దంపతుల కుమార్తె తానియా ఫేషియల్ డిస్ట్రోఫీ వ్యాధికి గురై తీవ్రమైన బాధతో ముఖ్యమంత్రికి తన దయనీయ పరిస్థితిపై సందేశం పంపింది. స్పందించిన సీఎం ఆ చిన్నారి ముఖానికి ప్రభుత్వ ఖర్చుతో శస్త్రచికిత్స చేయించారు. శస్త్రచికిత్సను ఆత్మస్థయిర్యంతో ఎదుర్కొన్న ఆ బాలిక తల్లిదండ్రులకు ప్రభుత్వం ఓ గృహాన్ని కేటాయిస్తుందని కూడా హామీ ఇచ్చారు. ఆ హామీ మేరకు సచివాలయానికి తానియా కుటుంబీకులను ఆహ్వానించి బాలికను పరామర్శించిన తరువాత స్టాలిన్ ఆ ఇంటి తాళాలను అప్పగించారు. ఇదేవిధంగా తిరువళ్లూరు జిల్లాలోని పానవేడుతోట్టంకు చెందిన దివ్యాంగురాలు అనసూయకు ఆటోమేటిక్ వీల్ ఛైర్‌ను అందజేశారు. ఉపముఖ్యమంత్రి ఉదయనిధి, మంత్రి ఎస్.ఎం.నాజర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎన్. మురుగానందం పాల్గొన్నారు.

మురుగునీటి యంత్రాల తనిఖీ

చెన్నైలో తాగునీటి సరఫరా ఆధ్వర్యంలో మురుగునీటి తొలగింపు యంత్రాల పనితీరును సీఎం తనిఖీ చేశారు. 48 మంది పారిశుధ్య కార్మికులు, దారిద్ర్యరేఖకు దిగువగా ఉన్న ఆది ద్రావిడులు, గిరిజనులను ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా మార్చేదిశగా వారికి మురుగునీటి తొలగింపు యంత్రాలను సీఎం గత ఏడాది అందజేశారు. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం తేనాంపేట జోన్ సీతమ్మాళ్ రోడ్డులో ఆ యంత్రాల పనితీరును స్టాలిన్ అధికారులతో కలిసి తనిఖీ చేశారు. ఓ మురుగునీటి కాలువ వద్ద కార్మికులు ఆ యంత్రం ద్వారా మురుగు తోడారు. అదే విధంగా కాలువలో పేరుకుపోయిన చెత్తాచెదారాల్ని తొలగించారు. శాసనసభ్యుడు డి.వేలు, డిప్యూటీ మేయర్ మహేష్‌కుమార్, నగర తాగునీటి సరఫరా శాఖ ప్రధాన కార్యదర్శి డి.కార్తికేయన్, కార్పొరేషన్ కమిషనర్ జె.కుమారగురుబరన్ తదితరులు పాల్గొన్నారు.

సమాచార దృష్టి

పొంగల్ ప్రత్యేక రైళ్లు

పెరంబూర్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): పొంగల్ పండుగ సందర్భంగా ప్రయాణికుల సౌకర్యార్థం తాంబరం నుంచి తిరునెల్వేలి, కన్నియాకుమారిలకు ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు దక్షిణ రైల్వే తెలిపింది.

● 06092 తిరునెల్వేలి - తాంబరం వారాంతపు ప్రత్యేక రైలు ఈ నెల 12, 19, 26 (ఆదివారం) తేదీల్లో తిరునెల్వేలి నుంచి మధ్యాహ్నం 3.30 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 4.10 గంటలకు తాంబరం చేరుకుంటుంది. మరో మార్గంలో నెం.06091 తాంబరం - తిరునెల్వేలి వారాంతపు ప్రత్యేక రైలు ఈనెల 13, 20, 27 (సోమవారం) తేదీల్లో తాంబరం నుంచి మధ్యాహ్నం 3.30 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 4.55 గంటలకు తిరునెల్వేలి చేరుకుంటుంది.

● నెం.06093 తాంబరం- కన్నియాకుమారి ప్రత్యేక రైలు ఈనెల 13న రాత్రి 10.30 గంటలకు తాంబరం నుంచి బయల్దేరి మరుసటి రోజు ఉదయం 6.15 గంటలకు కన్నియాకుమారి చేరుకుంటుంది. మరోమార్గంలో నెం.06094 కన్నియాకుమారి - తాంబరం ప్రత్యేక రైలు ఈనెల 14న మధ్యాహ్నం 3.30 గంటలకు కన్నియాకుమారిలో బయల్దేరి మరుసటిరోజు ఉదయం 6.15 గంటలకు తాంబరం చేరుకుంటుంది.

● నెం.06104 రామనాథపురం - తాంబరం ప్రత్యేక రైలు ఈనెల 10, 12, 17 తేదీల్లో రామనాథపురం నుంచి మధ్యాహ్నం 3.30 గంటలకు బయల్దేరి మరుసటిరోజు వేకువజామున 1.15 గంటలకు తాంబరం చేరుకుంటుంది. మరోమార్గంలో నెం.06103 తాంబరం - రామనాథపురం ప్రత్యేక రైలు ఈనెల 11, 13, 18 తేదీల్లో తాంబరం నుంచి సాయంత్రం 5 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 5.15గంటలకు రామనాథపురంచేరుకుంటుంది.

చెన్నై రన్నర్స్ సంస్థ ఆధ్వర్యంలో నేడు మారథాన్

ఐసిఎఫ్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): చెన్నై రన్నర్స్ సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 5న ఉదయం మారథాన్ నిర్వహించనున్నారు. ఈ మారథాన్ స్థానిక నేపియర్ వంతెన నుంచి ప్రారంభమై మెరీనా బీచ్, లైట్ హౌస్, మధ్యకైలాశ్, టైడల్‌పార్క్ మార్గం మీదుగా 42.195 కిలోమీటర్లు సాగనుంది. ఈ మారథాన్‌లో సుమారు 20వేల మంది పాల్గొననుండగా 30 శాతం మహిళలు, 100 మందికి పైగా అంధత్వ క్రీడాకారులు మూడు చక్రాల సైకిళ్లతో పోటీ పడనున్నారు. ఈ మారథాన్ దృష్ట్యా ట్రాఫిక్ పోలీసులు ఉదయం నుంచి సాయంత్ర 4 గంటల వరకు ఆ మార్గంలో వాహనాలను దారి మళ్లించనున్నారు. నేడు జరగనున్న మారథాన్‌కు మెట్రోరైల్ సేవలు తెల్లవారు జామున 3గంటల నుంచే ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు.

షాపింగ్ కోసం ప్రత్యేక బస్సులు

పెరంబూర్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): పొంగల్ పండుగ సందర్భంగా చెన్నై ప్రజలు షాపింగ్ చేసేందుకు సిద్ధమవుతున్నారు. ప్రజల సౌకర్యార్థం అదనపు బస్సు లు నడపనున్నారు. ఆ ప్రకారం, టీనగర్, పురుషవాక్కం, వాషర్‌మెన్‌పేట తదితర ప్రాంతాలకు నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి శని, ఆది, 11, 12 తేదీల్లో అదనంగా 50 బస్సులు నడపనున్నట్లు మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ తెలిపింది.

రైతులకు గుర్తింపు నెంబర్లు

పెరంబూర్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వ ఉత్తర్వులతో రాష్ట్రంలోని రైతులకు గుర్తింపు నెంబర్లను వ్యవసాయ శాఖ అందించనుంది. దేశవ్యాప్తంగా 11.8 కోట్ల మంది రైతులుండగా, రాష్ట్రంలో 80 లక్షల మంది ఉన్నారు. ఐదు ఎకరాల్లోపు భూములున్న వారు చిన్నకారు రైతులు, ఆపై ఉన్న వారు మోతుబరి రైతులుగా పరిగణిస్తుంటారు. రైతులు సాగు చేసేందుకు అవసరమైన సహాయాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్నాయి. ఇప్పటికే కేంద్రప్రభుత్వ ఉత్తర్వులతో, రైతు పేరు, భూములకు సంబంధించిన వివరాలు 'క్రైయిన్స్' అనే యాప్‌లో నమోదు చేశారు. ఈ నేపథ్యంలో, దేశవ్యాప్తంగా రైతులందరికీ గుర్తింపు నెంబరు అందించాలని రాష్ట్రప్రభుత్వాలకు ఉత్తర్వులు జారీ చేసిన కేంద్రం, 'ఫార్మర్స్ రిజిస్ట్రీ' అనే యాప్ అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ విషయమై రాష్ట్ర వ్యవసాయ అధికారులు మాట్లాడుతూ... ఒక్కో రెవెన్యూ గ్రామంలో ప్రత్యేక శిబిరాలు నిర్వహించి, రైతుల వివరాలు సేకరించి నెంబరు కేటాయించనున్నామన్నారు. ఆధార్ కార్డు లాగే బ్యాంకు రుణాలు సహా ఇతర సాగు పనుల సహాయాలకు ఈ గుర్తింపు నెంబరుగా ఉంటుందని వారు పేర్కొన్నారు.

కీలంబాక్కం-తిరువాన్మియూర్ మధ్య మరో రెండు 'ఏసీ' బస్సులు

పెరంబూర్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక కీలంబాక్కం బస్ టెర్మినల్‌కు నగరంలోని అన్ని ప్రాంతాల నుంచి ఎంటీసీ బస్సులు నడుపుతున్నారు. తిరువాన్మియూర్ నుంచి కీలంబాక్కంకు ఇప్పటికే సాధారణ, డీలక్స్, 2 ఏసీ బస్సులు నడుపుతున్నారు. ఈ మార్గంలో ప్రయాణికుల సంఖ్య అధికం కావడంతో, అదనంగా మరో రెండు ఏసీ బస్సులు నడపనున్నట్లు అధికారులు తెలిపారు.

10న వేణుగోపాలస్వామి ఆలయ గరుడ సేవ

పెరంబూర్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): కాంచీపురం సమీపం నాయకన్‌పేటలో రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో ఈనెల 10న వైకుంఠ ఏకాదశి ఉత్సవం నిర్వహించనున్నారు. తెల్లవారుజామున 5 గంటలకు వైకుంఠ ద్వార ప్రవేశం, అనంతరం గరుడ సేవ జరుగుతాయి. గరుడ వాహనంపై ఉత్సవమూర్తులు ప్రధాన వీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఉత్సవం సందర్భంగా 9వ తేది రాత్రంతా భజనలు, దివ్య ప్రబంధం, సంకీర్త నామావళి జరుగుతాయని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

బాలకృష్ణన్‌కు మతిభ్రమించిందా?

● మంత్రి పీకే శేఖర్‌బాబు ధ్వజం


హార్బర్ ప్రాంతంలో స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న మంత్రి శేఖర్‌బాబు

ప్యారీస్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): రెండు రోజుల క్రితం వరకు ముఖ్యమంత్రి స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే ప్రభుత్వాన్ని పొగడ్తలతో ముంచెత్తిన సీపీఎం రాష్ట్ర కార్యదర్శి కె.బాలకృష్ణన్‌కు ఏమైందని, వాస్తవాలు తెలుసుకోకుండా ప్రభుత్వాన్ని విమర్శించడం మతిభ్రమించినట్లుగా ఉందని హిందూ దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు విమర్శించారు. విల్లుపురంలో శుక్రవారం ప్రారంభమైన సీపీఎం 24వ రాష్ట్రస్థాయి మహానాడులో బాలకృష్ణన్ ప్రసంగిస్తూ... అన్నా విశ్వవిద్యాలయంలో విద్యార్థినిపై జరిగిన అత్యాచారాన్ని తమ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని, రాష్ట్రంలో ఏ ప్రాంతంలో మహిళలకు అన్యాయం జరిగినా ఆ చర్యలను వ్యతిరేకిస్తూ ముందుగా పోరాడేది ఒక్క సీపీఎం మాత్రమేనని అన్నారు. మతవాద బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌లను వ్యతిరేకిస్తున్న డీఎంకే నేతృత్వంలోని లౌకికవాద కూటమిలో తాము పయనిస్తున్నామని, అయితే హక్కుల కోసం రోడ్డెక్కి ఆందోళన చేపడుతున్న కార్మికులు, ప్రభుత్వ ఉద్యోగులను పోలీసులు అరెస్టుచేయడంతో పాటుకేసులు పెడుతున్నారని,ఈ చర్యలు అప్రకటిత ఎమర్జెన్సీ లాగా ఉందని బాలకృష్ణన్ ప్రభుత్వాన్ని నిలదీశారు. ఈ నేపథ్యంలో బాలకృష్ణన్ ప్రశ్నలకు సంబంధించి శనివారం మంత్రి శేఖర్‌బాబు మీడియాతో మాట్లాడారు. హార్బర్ ప్రాంతంలో పర్యటించిన ఆయన స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. న్యాయపరమైన హక్కుల కోసం పోరాడే ఆందోళనకారులను అణచివేసే ప్రయత్నాలు ప్రభుత్వం చేపట్టడం లేదని, ఉదయం అరెస్టు చేసి సాయంత్రానికి విడుదల చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో అన్ని వర్గాలను సమానంగా భావించి అందరికి లబ్ధి చేకూర్చే విధంగా పథకాలు ఉన్నాయని, మిత్రపక్షాలు ఆలోచించి ప్రభుత్వాన్ని విమర్శించాలని మంత్రి హితవు పలికారు.

కంచి ప్రభుత్వాస్పత్రిలో 10 వేల డయాలసిస్ చికిత్సలు

పెరంబూర్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): కాంచీపురం జిల్లా ప్రధాన ప్రభుత్వాస్పత్రిలో 2015 ఏప్రిల్ 24న మూడు యంత్రాలతో డయాలసిస్ విభాగాన్ని ప్రారంభించారు. తొలి ఏడాది 877 మందికి డయాలసిస్ చికిత్సలు అందించారు. ప్రస్తుతం ఈ కేంద్రంలో డయాలసిస్ యంత్రాల సంఖ్య 12కు పెంచారు. కేంద్రం ప్రారంభించినప్పటి నుంచి 2024లో అధికంగా 10,000 డయాలసిస్ చికిత్సలు అందించినట్లు ఆస్పత్రి జాయింట్ డైరెక్టర్ హిలారినా జోసితా నళిని తెలిపారు.

తిరుక్కురల్ సూక్తులతో తిరువళ్లువర్ చిత్రం


తిరుక్కురల్‌లో రూపొందించిన తిరువళ్లువర్ చిత్రం

పెరంబూర్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): కన్నియాకుమారి సముద్రంలో నిర్మితమైన తిరువళ్లువర్ విగ్రహ సిల్వర్ జూబ్లీ వేడుకలను పురస్కరించుకొని పాఠశాల విద్యార్థులు తిరుక్కురల్ సూక్తులతో తిరువళ్లువర్ చిత్రం రూపొందించారు. మదురై తిరునగర్‌లోని ముత్తుదేవర్ ముక్కులత్తోర్ మహోన్నత పాఠశాల విద్యార్థులు 1,330 తిరుక్కురల్ సూక్తులతో 25 అడుగులతో తిరువళ్లువర్ చిత్రాన్ని చిత్రీకరించారు. 15 మంది విద్యార్థులు ఆరు గంటలు శ్రమించి ఈ చిత్రం రూపొందించారు. ఈ సాధన చేసిన విద్యార్థులను పట్టణ ప్రముఖులు, ప్రజలు అభినందించారు.

300 శివలింగాలకు కోటి అర్చన


శివలింగాలపై తీర్థజలాలు ప్రోక్షిస్తున్న దృశ్యం

పెరంబూర్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): శివలింగాలకు కోటి అర్చన కార్యక్రమం వైభవంగా జరిగింది. కోయంబత్తూర్ జిల్లా పేరూరులో గురు మహాసన్నిధానం శాంతలింగ రామసామి అడిగళార్ స్మారక వేడుకలు నిర్వహిస్తున్నారు. ఈ వేడుకల్లో భాగంగా 300 శివలింగాలకు కోటి అర్చన వేడుకలు శుక్రవారం జరిగింది. ఈ వేడుకల్లో చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

పొంగల్ వేడుకల్లో విదేశీయులు


పొంగల్ వేడుకల్లో విదేశీయులు

పెరంబూర్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): తూత్తుకుడి సమీపం సాయర్‌పురంలో పొంగళ్లు పెట్టే పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో విదేశీ పర్యాటకులు ఆసక్తిగా పాల్గొన్నారు. 'రిక్షా ఛాలెంజ్' పర్యాటక ప్రాజెక్టులో బ్రిటన్, ఆస్ట్రేలియా, జర్మన్ తదితర దేశాలకు చెందిన 21 మంది ఆటోల్లో రాష్ట్రంలో పర్యటిస్తున్నారు. వీరు తూత్తుకుడి జిల్లాకు చేరుకున్న సమయంలో సాయర్‌పురంలో పొంగల్ వేడుకలు జరుగుతున్నాయి. ఈ పోటీల్లో భారత సంప్రదాయ దుస్తుల్లో పాల్గొన్న విదేశీయులు, స్థానికులు పొంగళ్లు పెట్టే కార్యక్రమాన్ని ఆసక్తిగా వీక్షించారు. అనంతరం పొంగళ్లు, చెరకు ఆరగించి స్థానికులతో కలసి సంప్రదాయ నృత్యం చేశారు.

విద్యార్థులకు టీషర్టుల పంపిణీ



చెన్నై, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక టి.నగర్‌లోని రాజన్ ఐకేర్ హాస్పిటల్, శ్రీ కన్నన్ భజనమండలి, నామ సంగీత సత్సంగ్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం 60 మంది పుట్‌బాల్ క్రీడాకారులకు టీ షర్టులు, టోపీల పంపిణీ జరిగింది. కన్నన్ భజనమండలి 70వ పడిలోకి అడుగుపెట్టిన సందర్భంగా ఈ ప్రోత్సాహకాలను అందించారు. ఈ సందర్భంగా కన్నన్ భజనమండలి ప్రతినిధి ఎ.లక్ష్మణన్ మాట్లాడుతూ.. గొప్ప ప్రేరణ కోసం విద్యార్థులకు టీషర్టులు, క్యాప్‌లను అందించినందుకు రాజన్ ఐ కేర్ హాస్పిటల్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డాక్టర్ మోహన్ రాజన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

జూనియర్ నేషనల్ ఛాంపియన్‌షిప్‌లో చెన్నై బృందం



ఛాంపియన్‌షిప్ పోటీల్లో చెన్నై బృందం

చెన్నై, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): చెన్నై ఈక్విటేషన్ సెంటర్‌కు చెందిన యువ రైడర్లు న్యూఢిల్లీలో జరిగిన జూనియర్ నేషనల్ ఛాంపియన్‌షిప్‌లో 18 పతకాలు సాధించి ఆల్ టైం రికార్డును నెలకొల్పారు. చిల్డ్రన్2 విభాగంలో కెవిన్ గాబ్రియేలు తన గుర్రపు సోల్‌మేట్ విభాగంలో జట్టు స్వర్ణం సాధించడంలో కీలక పాత్ర పోషించాడు. కెవిన్ వ్యక్తిగత రజత పతకాన్ని కైవసం చేసుకున్నాడు. సహచరుడు ఈషాన్ సుందరం తన బ్లాక్ మేర్, ఫేమ్ ఆఫ్ వైబర్టీతో స్వర్ణం సాధించాడు. ఈ బృందంలో గ్రాండ్ డ్యూటక్‌లో పునవ్ సురేష్, కోయంబత్తూరుకు చెందిన హాసిని కూడా వున్నారు.

రాష్ట్రంలో రూ.53.4 కోట్లతో 7 ఫ్లైఓవర్లు

● కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ ప్రకటన

చెన్నై, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రూ.53.4 కోట్లతో ఏడు ఫ్లైఓవర్లను నిర్మించేందుకు అనుమతులు జారీ చేశామని కేంద్ర రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్‌గడ్కరీ ప్రకటించారు. ఈ మేరకు ఆయన శనివారం రాష్ట్ర ప్రభుత్వానికి సమాచారం అందించారు. తిరుప్పూరు జిల్లాలో రూ.9.22 కోట్లతో రెండు ఫ్లైఓవర్లు నిర్మించనున్నామని తెలిపారు. ఆ జిల్లాలోని పొల్లాచ్చి తారాపురం - కరూరు రోడ్డులో ఓ ఫ్లైఓవర్, ఈరోడ్ - ముత్తూరు - వెళ్లకోవిల్ రోడ్డు వద్ద ఫ్లైఓవర్‌ను నిర్మిస్తామన్నారు. శివగంగ జిల్లాలోని దేవకోట - పుదుకోట రోడ్డులో రూ.8.26 కోట్లతో, అరియలూరు జిల్లా కొడుక్కూరు - కాడువెట్టి రోడ్డులో రూ.5.9 కోట్లతో, రామనాథపురం జిల్లాలో రూ.19.47 కోట్లతో ఫ్లైఓవర్లు నిర్మించేందుకు తన మంత్రిత్వ శాఖ అనుమతి జారీ చేసిందన్నారు. ఇదే విధంగా విరుదునగర్ జిల్లా ముదుగకూత్తరు - వీరచోళన్ రోడ్డులో రూ.10.64 కోట్లతో ఫ్లైఓవర్‌ను నిర్మించనున్నామని నితిన్ గడ్కరీ తెలిపారు.

'ఈరోడ్'ను మాకే కేటాయించాలి!

● కాంగ్రెస్ నేతల డిమాండ్


దివంగత ఎమ్మెల్యే తిరుమగన్ ఈవేరా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఏఐసీసీ సభ్యుడు రంగభాష్యం తదితరులు

ప్యారీస్, జనవరి4 (ఆంధ్రజ్యోతి): ఈరోడ్ తూర్పు నియోజకవర్గాన్ని మళ్లీ కాంగ్రెస్‌కే కేటాయించాలని ఈరోడ్ జిల్లా కాంగ్రెస్ నాయకుల సమావేశం తీర్మానించింది. కాంగ్రెస్ సీనియర్ నేత, ఈరోడ్ నియోజకవర్గ ఎమ్మెల్యే ఈవీకేఎస్ ఇళంగోవన్ అనారోగ్యం కారణంగా గత నెల 14న మరణించారు. దీంతో ఆయన ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించిన నియోజకవర్గం అసెంబ్లీలో ఖాళీ అయ్యిందని సచివాలయం ప్రకటించింది. ఈ నియోజకవర్గ ఎమ్మెల్యేగా పని చేసిన ఈవీకేఎస్ కుమారుడు తిరుమగన్ ఈవేరా 2023 జనవరి 4న ఆకస్మికంగా మృతి చెందడంతో ఆ సీటుకు ఉపఎన్నిక నిర్వహించారు. ఇందులో కాంగ్రెస్ అభ్యర్థిగా డీఎంకే కూటమి మద్దతుతో పోటీ చేసిన ఈవీకేఎస్ విజయం సాధించి ఎమ్మెల్యే అయ్యారు. ఆయన కూడా మృతి చెందడంతో ఆ నియోజకవర్గానికి ఉప ఎన్నిక సంబంధించిన నోటిఫికేషన్ త్వరలో విడుదలయ్యే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో శనివారం ఈరోడ్‌లోని ఈవీకేఎస్ ఇళంగోవన్ నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. దివంగత ఎమ్మెల్యే తిరుమగన్ ఈవేరా వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏఐసీసీ సభ్యుడు రంగభాష్యం మీడియాతో మాట్లాడుతూ... తిరుమగన్ వర్ధంతి సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఈరోడ్ తూర్పు నియోజకవర్గ ఉపఎన్నికలో ఈవీకేఎస్ ఇళంగోవన్ చిన్న కుమారుడు సంజయ్ సంపత్‌ను కాంగ్రెస్ అభ్యర్థిగా ప్రకటించాలని కోరుతూ తీర్మానించినట్టు తెలిపారు. ఈ తీర్మానాన్ని కూటమికి నాయకత్వం వహిస్తున్న డీఎంకే అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్తామని, దీనిపై త్వరలోనే ముఖ్యమంత్రి స్టాలిన్‌ను కాంగ్రెస్ సీనియర్లతో కలిసి చర్చించనున్నట్టు ఆయన పేర్కొన్నారు.

పర్యావరణంపై అవగాహన కల్పించండి


డా.అన్బుమణితో కన్నన్, రాజా

పెరంబూర్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): పర్యావరణంపై ప్రజలో అవగాహన కల్పించాలని పీఎంకే ప్రధాన కార్యదర్శి డాక్టర్ అన్బుమణి రాందాస్ పిలుపునిచ్చారు. నగరంలోని అన్బుమణి నివాసంలో ఇటీవల పసుమై తాయగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.కన్నన్, చెంగల్పట్టు జిల్లా కార్యదర్శి పమ్మల్ పీఎస్ఎస్ రాజా మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. పసుమై తాయగం పర్యావరణ పరిరక్షణపై చేపట్టిన అవగాహన కార్యక్రమాలు, మొక్కలు నాటడం, పాఠశాల విద్యార్థులకు మొక్కల పెంపకంపై అవగాహన తదితరాలను వివరించారు. వారి సేవలు అభినందించిన అన్బుమణి, పర్యావరణ పరిరక్షణకు మరిన్ని అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని కోరారు.

మున్సిపాలిటీలో విలీనంపై గ్రామస్తుల నిరసన

● అడ్డుకున్న పోలీసులతో మహిళల వాగ్వివాదం


రాస్తారోకోలో గ్రామస్తులు

తిరుత్తణి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలో పంచాయతీల విలీనాన్ని వ్యతిరేకిస్తూ గ్రామస్తులు రాస్తారోకో చేపట్టారు. రాష్ట్రంలోని కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, పట్టణ పంచాయతీల హద్దులు విస్తరిస్తూ రెండు రోజుల క్రితం ప్రభుత్వం జీవో విడుదల చేసింది. తిరుత్తణి మున్సిపాలిటీలో కార్తికేయపురం, పట్టాభిరామపురం పంచాయతీలు విలీనం కానున్నాయి. ఈ పంచాయతీలను మున్సిపాలిటీలో విలీనం చేస్తే పన్నుల రూపంలో తమపై ఆర్థిక భారం పడుతుందని, ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ఆయా పంచాయతీల ప్రజలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. ఇదే డిమాండ్‌తో శనివారం ఉదయం పట్టాభిరామపురం పంచాయతీకి చెందిన మహిళలు సహా 300 మంది కాశినాథపురం సర్కిల్ సమీపం చెన్నై - తిరుత్తణి జాతీయ రహదారిపై బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. సమాచారం అందుకున్న డీఎస్పీ కందన్ నేతృత్వంలో పోలీసులు అక్కడకు చేరుకుని ఆందోళనకారులను అక్కడి నుంచి పంపించేందుకు ఉపక్రమించారు. ఈ చర్యలను నిరసిస్తూ పలువురు మహిళలు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ఆందోళనకారుల నిరసనల నడుమ మాజీ సర్పంచ్ రాజశేఖర్ సహా 13 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. అరెస్ట్ చేసిన వారిని వెంటనే విడుదల చేయాలంటూ మహిళలు మళ్లీ ఆందోళన చేపట్టారు. అక్కడకు చేరుకున్న ఆర్డీఓ దీప, అరెస్ట్ చేసిన వారిని సాయంత్రంలోపు విడుదల చేస్తామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు. కాగా, ఇదే కోరికతో కార్తికేయపురం పంచాయతీకి చెందిన 500 మహిళలు అరక్కోణం రోడ్డుపై బైఠాయంచారు.

ఐఏఎస్ అధికారిపై విచారణ

హైకోర్టుకు తెలిపిన ప్రభుత్వం

వాషర్‌మెన్‌పేట, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారన్న కేసులో ఐఏఎస్ అధికారిపై విచారణ జరుగుతోందని మద్రాసు హైకోర్టుకు రాష్ట్ర ప్రభుత్వం తెలియజేసింది. సమాజ సేవకుడు ఏఆర్ గోకులకృష్ణన్ మద్రాసు హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌లో... దిండుగల్ జిల్లాలో 2012-14 వరకు, తేని జిల్లాలో 2014-16 వరకు కలెక్టర్‌గా పనిచేసిన వెంకటాచలం ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారని, కోట్ల విలువైన ఆస్తులు తన భార్య సుగుణాంబాళ్ పేరున కొనుగోలు చేశారన్నారు. ఆ స్థలాలు కూడా తక్కువ ధరకు రిజిస్ట్రేషన్ చేయించారని, కందస్వామి నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేశారని తెలిపారు. ఈ విషయమై గోపిచెట్టిపాళయం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు చేపట్టలేదన్నారు. అదే సమయంలో కందస్వామిపై సుగుణాంబాళ్ గోపిచెట్టిపాళయం జిల్లా మున్సిఫ్ మేజిస్ట్రేట్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారని, ఈ కేసులు లోక్ అదాలత్‌లో పరిష్కరించినట్లు ప్రకటించారని వివరించారు. కలెక్టర్ తన అధికారబలంతో సుమారు రూ.20 కోట్ల ఆస్తులు తన భార్య పేరు మీద కొనుగోలు చేశారని, ఈ వ్యవహారంపై గత ఏడాది జూన్ 15న రాష్ట్ర ప్రభుత్వానికి, కేంద్ర విజిలెన్స్ విభాగానికి ఫిర్యాదు చేసినా ఇప్పటివరకు చర్యలు చేపట్టలేదని, ఈ వ్యవహారంపై విచారణ చేపట్టేలా ఉత్తర్వులు జారీ చేయాలని పిటిషన్‌లో కోరారు. ఈ పిటిషన్‌ను హైకోర్టు న్యాయమూర్తి శేషసాయి విచారించగా ప్రభుత్వం తరఫున హాజరైన న్యాయవాది ముఖిలన్, పిటిషన్‌దారుడు ఫిర్యాదుపై విచారణ జరుగుతోందని వివరించారు. ప్రభుత్వ వాదన పరిగణలోకి తీసుకున్న న్యాయమూర్తి, కేసు విచారణ ముగిసినట్లు ఉత్తర్వులు జారీ చేశారు.

నేడు సబర్బన్ రైళ్ల రద్దు

పెరంబూర్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక తాంబరం యార్డ్‌లో న్యూ ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణపనుల కారణంగా ఆదివారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటలకు వరకు చెన్నై బీచ్ - తాంబరం మార్గంలో సబర్బన్ రైళ్లు రద్దు చేసినట్టు దక్షిణ రైల్వే విడుదల చేసింది. ఆ సమయంలో ప్రయాణికుల సౌకర్యార్థం చెన్నై బీచ్ - పల్లావరం, గూడువాంజేరి - చెంగల్పట్టు మధ్య ప్రత్యేక సబర్బన్ రైళ్లు నడపనున్నట్టు తెలిపింది. మధ్యాహ్నం 2 గంటల అనంతరం రైళ్లే యథావిధిగా నడుస్తాయని పేర్కొంది.

గంజాయి తరలింపు కేసులో ముగ్గురికి తలా 12 ఏళ్ల జైలు

పెరంబూర్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): గంజాయి తరలింపు కేసులో ముగ్గురికి 12 ఏళ్ల చొప్పున జైలుశిక్ష పడింది. ఆంధ్ర రాష్ట్రం అన్నవరం నుంచి రాష్ట్రానికి గంజాయి తరలిస్తున్నట్లు 2021 జూలై 17న మాదకద్రవ్యాల నిరోధక విభాగం పోలీసులకు సమాచారం అందింది. ఈ సమాచారంతో ఊత్తుకోట సమీపం ఆరణి నది వంతెనపై పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో అటుగా వచ్చిన లారీని అడ్డుకొని తనిఖీ చేసి, 327 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారంలో లారీ డ్రైవర్ శంకర్‌ను విచారించగా, స్థానిక కొడుంగైయూర్‌కు చెందిన మైఖేల్ ఆంధ్రా నుంచి గంజాయి తీసుకొచ్చి కేరళ సరిహద్దుల్లోని కలియక్కావిల్‌కి చెందిన నాథ్‌కు అందజేయనున్నాడని తెలిపారు. దీంతో, శంకర్, మైఖేల్, నాథ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసు విచారణ చెన్నై మాదకద్రవ్యాల నిరోధక విభాగం ప్రత్యేక కోర్టులో పూర్తి ఆయిన నేపథ్యంలో తగిన సాక్ష్యాధారాలతో అభియోగాలు రుజువు కావడంతో, శంకర్, నాథ్, మైఖేల్‌కు తలా 12 ఏళ్ల జైలు, రూ.3 లక్షల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు.

అడవి ఏనుగులను తరిమేందుకు గుంకీ ఏనుగుల రాక


నీలమలకోటకు చేరుకున్న గుంకీ ఏనుగు

పెరంబూర్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ భూములను ధ్వంసం చేస్తున్న అడవి ఏనుగులను బంధించేందుకు రెండు గుంకీ ఏనుగులు రంగంలో దిగాయి. దిండుగల్ జిల్లా నీలమలకోట, కినత్తుపట్టి, కొంబై తదితర గ్రామాల్లో రైతులు వరి సహా పలురకాల పంటలు, అరటి తదితరాలు సాగుచేస్తున్నారు. ఈ గ్రామాల పైతట్టు ఉన్న పశ్చిమ కనుమల కొండల నుంచి వస్తున్న ఏనుగుల ముంపు పొలాల్లో ప్రవేశించి పంటలు ధ్వంసం చేస్తున్నాయి. అడవి ఏనుగులు ఈ ప్రాంతాల్లోకి రాకుండా చర్యలు చేపట్టాలని గ్రామస్తులు అటవీ శాఖకు విజ్ఞప్తి చేశారు. దీంతో, పునరావాస కేంద్రంలో సంరక్షిస్తున్న రెండు గుంకీ ఏనుగులను ఆ ప్రాంతానికి రప్పించిన అటవీ శాఖ సిబ్బంది, అడవి ఏనుగులను బంధించడం, దూర ప్రాంతాలకు తరలించే పనులు చేపట్టారు.

గోడ కూలి ఇద్దరు ఉత్తరాది కార్మికుల మృతి

పెరంబూర్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూర్ జిల్లా పొల్లాచ్చి సమీపంలో ప్రైవేటు కర్మాగారం గోడ కూలిన ఘటనలో ఉత్తరాదికి చెందిన ఇద్దరు కార్మికులు మృతి చెందారు. కానియాలాంపాళయంలో ప్రైవేటు కర్మాగారం నిర్మాణ పనుల్లో 60 మందికి పైగా ఉత్తరాది కార్మికులు పనిచేస్తున్నారు. శనివారం మధ్యాహ్నం ఎక్స్‌కవేటర్‌తో గుంత తవ్వుతున్న సమయంలో, పక్కనే కొత్తగా నిర్మించిన గోడ కూలిపడింది. గోడ శిథిలాల కింద చిక్కుకొని పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన రెగెసన్(28), సనర్మాంజి (40) ఘటనా స్థలంలోనే మృతిచెందారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

అన్నా విశ్వవిద్యాలయానికి బాంబు బెదిరింపు

చెన్నై, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక గిండిలోని అన్నా విశ్వవిద్యాలయానికి బాంబు బెదిరింపు కలకలం రేపింది. ఈ-మెయిల్ ద్వారా వచ్చిన బెదిరింపు విషయమై వర్సిటీ అధికారులు కోట్టూరుపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాంబ్ స్క్వాడ్, పోలీసు జాగిలంతో అక్కడికి చేరుకున్న పోలీసులు, వర్సిటీ ప్రాంగణం, పరిసరాలను క్షుణ్ణంగా తనిఖీచేశారు. ఆ ప్రాంతాల్లో ఎలాంటి పేలుడు పదార్థాలు లభించకపోవడంతో, బాంబు బెదిరింపు ఫేక్ అని నిర్ధారించి, ఈ-మెయిల్ పంపిన చిరునామా ఆధారంగా విచారణ చేపట్టారు. కాగా, ఇప్పటికే ఈ వర్సిటీ ప్రాంగణంలో ఇంజనీరింగ్ విద్యార్థినిపై అత్యాచారం ఘటనపై ప్రత్యేక బృందం విచారణ చేపడుతున్న నేపథ్యంలో, ఈ వర్సిటీకి బాంబు బెదిరింపు రావడం కలకలం రేపింది.

17న ప్రభుత్వ సెలవు

చెన్నై, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): పొంగల్ పండుగ సందర్భంగా ఈ నెల 17న ప్రభుత్వ సెలవు రోజుగా ప్రకటించారు. పొంగల్ సందర్భంగా ఈనెల 14, 15, 16 తేదీలు సెలవులు. ఈ క్రమంలో 17వ తేది శుక్రవారం కూడా సెలవు ప్రకటిస్తే శని, ఆదివారాలు సెలవు దినాలుగా ఉంటాయని, పండుగకు స్వగ్రామాలకు వెళ్లే వారికి ఆరు రోజుల సెలవులు ఉపయోగకరంగా ఉంటాయని ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. దీన్ని పరిశీలించిన ప్రభుత్వం, 17వ తేది సెలవు రోజుగా ప్రకటిస్తూ, ఆ రోజుకు ప్రత్యామ్నాయంగా 25వ తేది (శనివారం) పనిదినంగా ఉంటుందని తెలియజేసింది.

9మంది జాలర్ల అదృశ్యం

చెన్నై, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): నాగపట్టినం నుంచి సముద్రంలో చేపల వేటకు వెళ్లిన 9 మంది జాలర్లు అదృశ్యమయ్యారు. గత నెల 29వ తేది నాగూర్ సంబాతోట్టం జాలర్ల గ్రామానికి చెందిన వలర్మతి సెల్వమణికి చెందిన ఫైబర్ పడవలో 9 మంది జాలర్లు చేపల వేటకు వెళ్లారు. ఈ నెల 1వ తేది నడి సముద్రంలో చేపల వేట సాగిస్తుండగా, పడవ మరమ్మతులకు గురైంది. ఆ పడవలో ఉన్న జాలర్లు సహచరులకు సమాచారం అందించినా ఫలితం లేకపోయిందని సమాచారం. కాగా, అదృశ్యమైన జాలర్ల ఆచూకీ తెలుసుకొనేలా వైమానిక, తీరప్రాంత భద్రతా విభాగం సత్వరం చర్యలు చేపట్టాలని బాధిత కుటుంబాలు విజ్ఞప్తి చేస్తున్నాయి.

వండలూరు సమీపంలో పట్టాలపై ఇనుపరాడ్

కొల్లమ్ ఎక్స్‌ప్రెస్‌కు తప్పిన ముప్పు

చెన్నై, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): వండలూరు రైల్వేస్టేషన్ సమీపంలో పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తులు ఇనుపరాడ్‌ను ఉంచడంతో శనివారం వేకువజాము కొల్లమ్ ఎక్స్‌ప్రెస్ రైలు కుదుపులకు గురైంది. డ్రైవర్ చాకచక్యంగా రైలును నిలిపి ఉన్నతాధికారులకు సమాచారం అందించడంతో ముప్పు తప్పింది. ఆ ఎక్స్‌ప్రెస్ వండలూరు స్టేషన్‌ను దాటుతుండగా పట్టాలపై ఏదో పగిలినట్లు పెద్ద శబ్దం ఏర్పడింది. దాన్ని విన్న రైలింజన్ డ్రైవర్ బ్రేకులు వేసి రైలును నిలిపివేశారు. ఆ తర్వాత రైల్వే ఉన్నతాధికారులకు ఆ సమాచారం అందించారు. దీంతో వెంటనే రైల్వే ఇంజనీరింగ్ సాంకేతిక నిపుణులు, భద్రతా విభాగం అధికారులు హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. ఆ రైలు కింద పరిశీలించగా రేకులా నలిగిన ఇనుపరాడ్ కనిపించింది. అధికారులు దాన్ని తొలగించి, ఆ పట్టాలను వెంటనే సరిచేశారు. ఆ తర్వాత ఆ మార్గంలో రైలు రాకపోకలను పునరుద్ధరించారు.

చిన్నారి మృతి కేసులో పాఠశాల కరెస్పాండెంట్ సహా ముగ్గురి అరెస్ట్

ప్యారీస్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): విల్లుపురం జిల్లాలోని విక్రవాండి సెయింట్ మేరీస్ మెట్రిక్యులేషన్ ప్రైవేటు పాఠశాలలో శుక్రవారం సెప్టిక్ ట్యాంక్‌లో పడి మృతిచెందిన లియాలక్ష్మి (3) కేసుకు సంబంధించి పాఠశాల కరస్పాండెంటు సహా ముగ్గురిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. చిన్నారి మృతిపై పిల్లల సంరక్షణ కమిటీ సభ్యులు శనివారం పాఠశాలలో విచారణ జరిపారు. బాలిక మృతిచెందిన సమాచారం తమకు పాఠశాల నిర్వాహకులు ఆలస్యంగా తెలియజేశారని, ఈ విషయంలో నిర్లక్ష్యం చూపిన వారిపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని చిన్నారి తండ్రి పళనివేలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు పాఠశాల కరెస్పాండెంట్ ఎమిల్డా, ప్రిన్సిపాల్ డొమెనిక్ మేరీ, టీచర్ ఏంజెల్‌ను శనివారం అరెస్ట్ చేశారు. ఇదిలా ఉండగా శనివారం ఉదయం విల్లుపురం ప్రభుత్వాస్పత్రిలో పోలీసు భద్రతతో చేపట్టిన పోస్టుమార్టం దృశ్యాలను వీడియో రికార్డు చేశారు. ఆ తర్వాత మృతదేహాన్ని తల్లిదండ్రులకు అప్పగించారు. ఆమె ఇంటికి వెళ్లి మృతదేహానికి అంజలి ఘటించిన రాష్ట్రమంత్రి పొన్ముడి చిన్నారి కుటుంబానికి ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రకటించిన రూ.3 లక్షల చెక్కును తల్లిదండ్రులకు అందజేశారు.



'మదగజరాజా'లో విశాల్, సంతానం

12 ఏళ్ల వివాదానికి తెర

- 12న 'మదగజరాజా' విడుదల

విశాల్, అంజలి, వరలక్ష్మి, సంతానం, ప్రకాష్ రాజ్, సోను సూద్ తదితర తారాగణం నటించిన 'మదగజరాజా' సినిమా ఎట్టకేలకు విడుదలకు నోచుకోనుంది. 12 ఏళ్లుగా ఉన్న ఈ సినిమా వివాదానికి తెరపడడంతో పొంగల్ పండుగ సందర్భంగా ఈనెల 12న విడుదలకానుంది. జెమిని ఫిల్మ్ సర్క్యూట్ నిర్మించిన ఈ చిత్రానికి సుందర్ సి దర్శకత్వం వహించారు. 2012లోనే అన్ని నిర్మాణ కార్యక్రమాలు పూర్తి చేసుకుంది. అయితే, నిర్మాణ సంస్థ ఆర్థిక కష్టాలతో పాటు అనేక సమస్యల్లో చిక్కుకోవడంతో విడుదలకు బ్రేక్ పడింది. ఈ మధ్యకాలంలో ఈ సినిమాను విడుదల చేసేందుకు చేసిన ప్రయత్నాలు కూడా ఫలించలేదు. ఈ నేపథ్యంలో సంక్రాంతికి విడుదల చేస్తున్నట్టు మేకర్స్ శుక్రవారం అధికారికంగా ప్రకటించారు. పూర్తి కామెడీ నేపథ్యంలో సాగే కమర్షియల్ బాణీలో ఈ సినిమాను రూపొందించారు. ఈ సినిమాకు సంబంధించి కొత్త ట్రైలర్‌ను తాజాగా విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. రిచర్డ్ ఎం. నాథన్ ఛాయాగ్రహణం. విజయ్ ఆంటోని సంగీతం సమకూర్చారు.

తండ్రితో పోటీపడనున్న కుమార్తె!




అదితి శంకర్

తన తండ్రి, డైనమిక్ డైరెక్టర్ శంకర్‌తో ఆయన కుమార్తె అదితి శంకర్ పొంగల్‌కు వెండితెరపై పోటీపడుతున్నారు. శంకర్ దర్శకత్వం వహించిన 'గేమ్ ఛేంజర్', అదితి శంకర్ హీరోయిన్‌గా నటించిన 'నేసిప్పాయా' విడుదలకానున్నాయి. దీంతో ఈ సంక్రాంతికి తండ్రీకుమార్తెలు వెండితెరపై నువ్వా నేనా అని తేల్చుకోనున్నారు. కార్తీ హీరోగా నటించిన 'విరుమన్'తో వెండితెర అరంగేట్రం చేసిన అదితి శంకర్ ఆ తర్వాత శివకార్తికేయన్ నటించిన 'మావీరన్'లో నటించారు. ఇపుడు విష్ణువర్ధన్ దర్శకత్వంలో సీనియర్ నటుడు దివంగత మురళి రెండో కుమారుడు ఆకాష్ మురళి హీరోగా పరిచయమవుతూ రూపొందిన 'నేసిప్పాయా'లో నటించారు. అయితే, ఇటీవల వరకు ఈ సినిమా పొంగల్ రేస్‌లో లేదు. కానీ, అగ్రహీరో అజిత్ కుమార్ నటించిన 'విడాముయర్చి' మూవీ తప్పుకోవడంతో అనేక చిత్రాలు విడుదలకు సిద్ధమయ్యాయి. అలాంటి వాటిలో ఈ చిత్రం ఒకటి. టాలీవుడ్ హీరో రామ్ చరణ్ - ఎస్.శంకర్ కాంబోలో తెరకెక్కిన పాన్ ఇండియా మూవీ 'గేమ్ ఛేంజర్'ను ఈ నెల 10న విడుదల చేస్తున్నారు. దీంతో శంకర్, అదితి శంకర్‌కు ఈ పొంగల్ ఒక ప్రత్యేకంగా మిగిలిపోనుంది.

తమిళ చిత్రజ్యోతి

ఈ యేడాదైనా తమిళ చిత్రపరిశ్రమకు మంచి రోజులు రావాలని సినీ ప్రముఖులు బలంగా కోరుకుంటున్నారు. దీనికి కారణం.. ఈ యేడాది పలువురు పెద్ద హీరోలు నటించిన చిత్రాలు నిర్మాణ దశలో ఉండటమే. 'ఇప్పటివరకు పూర్తిగా సంతృప్తినిచ్చే చిత్రానికి నేను దర్శకత్వం వహించలేదు' అని హాలీవుడ్ దర్శకుడు రోమన్ పొలన్‌స్కీ అంటారు. ఎన్నో బ్లాక్‌బస్టర్ చిత్రాలను అందించిన ఈయన.. 'ది పియానిస్ట్' మూవీకి ఆస్కార్ అవార్డును సైతం సొంతం చేసుకున్నారు. అలాంటి హాలీవుడ్ దర్శకుడిని కోలీవుడ్ దర్శకులు ఆదర్శంగా తీసుకుని చిత్రాలను రూపొందించాలని ప్రేక్షకులు కోరుతున్నారు. ఎందుకంటే, గత యేడాదిలో మొత్తం 241 చిత్రాలు విడుదలకాగా, వీటిలో వేళ్లపై లెక్కించదగిన సంఖ్యలోనే విజయం సాధించాయి. అనేక స్టార్ దర్శకులు రూపొందించిన చిత్రాలు భారీ అంచనాలతో విడుదలై బాక్సాఫీస్ వద్ద బోల్తా కొట్టాయి. దీంతో ఈ యేడాది పెద్ద హీరోల చిత్రాలపై ప్రేక్షకులతో పాటు చిత్రపరిశ్రమ కూడా గంపెడాశలు పెట్టుకుంది. పలు భారీ బడ్జెట్, పెద్ద హీరోల చిత్రాలు ఉండగా, ఇలాంటి వాటిలో కొన్ని చిత్రాల విశేషాలు ఇవీ...

2025లో భారీ అంచనాలు



'కూలీ'లో రజనీకాంత్



'వీర ధీర శూరన్'లో విక్రమ్ - దుషార

కూలీ (రజనీకాంత్)

లోకేష్ కనకరాజ్ - సూపర్‌స్టార్ రజనీకాంత్ కాంబినేషన్‌లో రూపొందుతున్న ఈ చిత్రం సమ్మర్ స్పెషల్‌గా రానుంది. సత్యరాజ్, అమీర్‌ఖాన్, ఉపేంద్ర, నాగార్జున, శ్రుతి హాసన్ వంటి భారీ తారాగణం నటించారు. ఇప్పటికే విడుదల చేసిన ఈ సినిమా టీజర్ ఎంతగానో ఆకట్టుకుంది. లోకేష్ కనకరాజ్ విజ్యువలైజేషన్, స్క్రీన్‌ప్లే ట్రీట్మెంట్ కోసం ఎంతో ఆత్రుతగా ఎదురు చూస్తున్నారు.

'విడాముయర్చి... గుడ్ బ్యాడ్ అగ్లీ' (అజిత్)

గత యేడాది అజిత్ కుమార్ నటించిన ఒక్క చిత్రం కూడా విడుదల కాలేదు. దీంతో ఈ యేడాది ఆయన నటించిన రెండు చిత్రాలు విడుదలకానున్నాయి. వీటిలో 'విడాముయర్చి' సినిమా ఈ పొంగల్‌కు విడుదలకావాల్సి ఉండగా, చివరి నిమిషంలో వాయిదా వేశారు. ఈ సినిమాతో పాటు 'గుడ్ బ్యాడ్ అగ్లీ' సినిమా విడుదలకానుంది.

'ఇండియన్-3' (కమల్)

శంకర్ దర్శకత్వంలో రూపొందిన 'ఇండియన్-2' మూవీ గత యేడాది విడుదలై తీవ్ర నిరుత్సాహానికి గురిచేసింది. దీంతో 'ఇండియన్-3'పై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇందులో కమలహాసన్‌కు సంబంధించి ఫ్లాష్‌బ్యాక్ సన్నివేశాలు గూస్‌బంప్స్ వచ్చేలా చేస్తాయని భావిస్తున్నారు. అయితే, ఈ మూవీని థియేటర్‌లో విడుదల చేస్తారా లేదా ఓటీటీలో రిలీజ్ చేస్తారా అన్నది తెలియాల్సివుంది.

'వణంగాన్' (అరుణ్ విజయ్)

బాలా దర్శకత్వంలో సూర్య హీరోగా తెరకెక్కించేలా పూజా కార్యక్రమం నిర్వహించారు. అనివార్య కారణాలతో సూర్య తప్పుకోవడంతో అరుణ్ విజయ్ కథానాయకుడిగా నటించారు. ఈనెల 10న విడుదలకానుంది. ఈ యేడాది భారీ అంచనాలున్న చిత్రాల్లో తొలుత విడుదలవుతున్న చిత్రం ఇదే కావడం గమనార్హం.

థగ్‌లైఫ్ (కమలహాసన్)

దాదాపు రెండు దశాబ్దాల తర్వాత కమలహాసన్ - మణిరత్నం కాంబినేషన్‌లో రూపొందుతుంది. కమల్ కుమారుడిగా హీరో శింబు నటిస్తున్నారు. త్రిష, జోజు జార్జి, అభిరామి, ఐశ్వర్య లక్ష్మి వంటివారు నటించారు. జూన్ 5న విడుదల చేయనున్నారు. సంగీతం ఏ.ఆర్.రెహ్మాన్.

విజయ్ 69 (విజయ్)

'ది గోట్' మూవీ తర్వాత రాజకీయాల్లో ప్రవేశించిన హీరో విజయ్ నటించే చిత్రం 'విజయ్69'. హెచ్.వినోద్ దర్శకుడు. ఇందులో రాజకీయ అంశాలు పుష్కలంగా ఉంటాయని భావిస్తున్నారు. పూజా హెగ్డే హీరోయిన్. బాబీ డియోల్ ప్రతినాయకుడిగా నటిస్తున్నారు.

'రెట్రో... సూర్య-45' (సూర్య)

'కంగువా' వంటి డిజాస్టర్ తర్వాత హీరో సూర్య నటించే ఈ చిత్రాలు నిర్మాణ దశలో ఉన్నాయి. ఒక చిత్రానికి కార్తీక్ సుబ్బరాజ్, మరో చిత్రానికి ఆర్జే.బాలాజీ దర్శకత్వం వహిస్తున్నారు. వీటిలో 'రెట్రో' మూవీ టీజర్ ఇప్పటికే విడుదలకాగా, మంచి స్పందన వచ్చింది.

'ఎస్‌కే23' (శివకార్తికేయన్)

ఏఆర్ మురుగదాస్ దర్శకత్వంలో శివకార్తికేయన్ నటించే ఈ చిత్రంలో రుక్మణి వసంత్, విద్యుత్ జాంవల్, బిజూ మేనన్ వంటి అనేక మంది అగ్ర నటీనటులు నటిస్తున్నారు. అనిరుధ్ సంగీతం అందిస్తున్నారు. లక్ష్మీ మూవీస్ ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తోంది. 'అమరన్' వంటి బ్లాక్‌బస్టర్ హిట్ తర్వాత శివకార్తికేయన్ మార్కెట్ ఒక్కసారిగా పెరిగిపోయింది. దీంతో ఈ సినిమాపై అంచనాలు కూడా అదేస్థాయిలో ఉన్నాయి.

'వీర ధీర శూరన్... చియాన్-63' (విక్రమ్)

అరుణ్ కుమార్ దర్శకత్వంలో విక్రమ్, సూరజ్, దుషార విజయన్ తదితరులు నటించిన 'వీర ధీర శూరన్' సినిమా త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. ఆ తర్వాత మడోన్ అశ్విన్ దర్శకత్వం వహించే 'చియాన్ 63' ఈ యేడాది ఆఖరులో విడుదలకానుంది.

వీటితో పాటు శింబు నటించే చిత్రం, కార్తీ హీరోగా తెరకెక్కే 'వా వాత్తియారే', 'సర్దార్-2', జయం రవి కథానాయకుడిగా తెరకెక్కుతున్న 'జీని', విజయ్ సేతుపతి నటించే 'ట్రైన్', 'ఏస్' వంటి చిత్రాలపై కూడా అంచనాలు ఉన్నాయి. అలాగే, గత యేడాది ఎలాంటి అంచనాలు లేకుండా వచ్చిన 'మహారాజ', 'లబ్బర్ పందు', 'వాళై' వంటి పలు చిత్రాలు బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల వరద పారించాయి. ఆ తరహాలో ఈ యేడాది ఎన్ని చిత్రాలు వస్తాయో వేచి చూడాల్సివుంది.





వంటకు తెప్పించిన టమోటాలు, ఉల్లిపాయలు, నిమ్మకాయలు - నూనె లేకుండా తయారవుతున్న చపాతీలు



అన్నం ఉడికిందా అని పరిశీలిస్తున్న పాకశాస్త్ర ప్రవీణురాలు

జీహెచ్‌లో స్టార్ హోటల్‌ను తలపించే వంటకాలు

SUNDAY SPECIAL

- ముప్పూటలా రోగులకు రుచికరమైన అన్నపానీయాలు
- 'ఈట్ రైట్ క్యాంపస్'గా ఆహారభద్రతా విభాగం గుర్తింపు

నగరంలో ఉన్న దేశంలోనే అతిపెద్ద ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఒకటైన రాజీవ్‌గాంధీ స్మారక సర్వజన ప్రభుత్వ ఆస్పత్రికి రోజూ సగటున 12 వేల మంది అవుట్ పేషంట్లు వచ్చివెళ్తుంటారు. ఈ ఆస్పత్రికి రాష్ట్రం నలమూలల నుంచి మెరుగైన చికిత్సల కోసం వేల సంఖ్యలో రోగులు అత్యవసర చికిత్సా విభాగాల్లో అడ్మిట్ అవుతుంటారు. ఈ ఆస్పత్రిలో 3500 మంది రోగులకు సకల సదుపాయాలతో పడకలతో కూడిన వార్డులున్నాయి.

- టి.నగర్, ఆంధ్రజ్యోతి

ఈట్ రైట్ క్యాంపస్...

ఈ ఆస్పత్రిలో రోజుకు ఎంత తక్కువ కాదన్నా 2500 మంది దాకా ఇన్‌పేషంట్లు చికిత్సలు పొందుతుంటారు. మరి వీరికి శుచికరమైన, రుచికరమైన అన్నపానీయాలను ముప్పూటలా అందజేయడం అంత సులభం కాదు. ప్రమాదాల్లో గాయపడినవారు, హృద్రోగులు, మూత్రాశయ వ్యాధులు, మధుమేహం, పక్షవాతం తదితర వ్యాధులతో బాధపడుతున్నవారు అంటూ వివిధ రకాల రోగులకు వారికున్న రోగాల తీవ్రతను బట్టి మూడు పూటలా స్టార్‌హోటల్ లేదా రెస్టారెంట్లలో తయారు చేసేలా ఈ ఆస్పత్రిలో పాకశాల ప్రవీణులు శుచికరమైన శుభ్రమైన ఆహార పదార్థాలను అందిస్తున్నారు. అంతే కాదండోయ్...! రాష్ట్ర ఆహార భద్రతా విభాగం ఈ పెద్దాస్పత్రిలో వంటకాల తయారీని సునిశితంగా పరిశీలించిన మీదట 'ఈట్ రైట్ క్యాంపస్' పేరుతో సర్టిఫికేట్‌ను కూడా ప్రదానం చేసింది. శుభ్రమైన వాతావరణంలో చక్కటి ఆహారపదార్థాలను ఆరగించడానికి అనువైన ఆసుపత్రి ప్రాంగణం ఇదేనంటూ ఆ విభాగం డంకా వాయించిమరీ ప్రకటించడం మరీ విశేషం.



వంటకాల రుచిని పరిశీలిస్తున్న పాకశాస్త్ర ప్రవీణురాలు

తట్టలో చపాతీలను మోసుకెళుతున్న మహిళా సిబ్బంది



చపాతీ పిండిని మెత్తబరుస్తున్న యంత్రం

ముప్పూటలా...

ఈ ఆస్పత్రిలో ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, రాత్రి మళ్లీ అల్పాహారం అందిస్తున్నారు. ఈ విషయమై ఆ ఆస్పత్రిలో మధుమేహానికి చికిత్సలందుకుంటున్న రాజశేఖరన్ మాట్లాడుతూ... షుగర్ పేషెంట్లకు ప్రత్యేకమైన ఆహార పదార్థాలను అందిస్తున్నారని తెలిపారు. ప్రైవేటు ఆస్పత్రులకు దీటుగా ఈ ఆహార పదార్థాలు శుచిగా ఉంటున్నాయని చెప్పారు. కాంచీపురానికి చెందిన రోగి ఆనంది మాట్లాడుతూ మధ్యాహ్నభోజనంలో కోడిగుడ్లు కూడా అందిస్తున్నారని, అల్పాహారంతోపాటు పాలు, పండ్లు కూడా సరఫరా చేస్తున్నారని చెప్పుకొచ్చారు. ఆ ఆస్పత్రి న్యూట్రిషనిస్ట్ కళైవాణి మాట్లాడుతూ... ఆసుపత్రిలో ప్రతిరోజూ సుమారు 2500 మంది రోగులకు చక్కటి ఆహారపదార్థాలను తయారు చేసి అందిస్తున్నామని, ప్రతి ఆహార పదార్థాన్ని ముందుగా తాము పరిశీలించిన తర్వాతే వడ్డిస్తామన్నారు. అన్నం బాగా ఉడికిందా, చపాతీలు మృదువుగా ఉన్నాయా, ఇడ్లీలు వేడిగా ఉన్నాయా అని చూడటమే కాకుండా సాంబారు, చట్నీ, ఆకుకూరలు, తాళింపులు, రసంలో మసాలా వస్తువులు సమపాళ్లలో ఉన్నాయా, ఉప్పు, పులుపు, కారం మితంగా ఉన్నాయా అని రుచి చూసి, పరిశీలించిన తరువాత శుభ్రంగా కడిగిన స్టీలు పాత్రల్లోని వాటిని తీసుకెళ్లి రోగులకు వడ్డిస్తున్నామని చెప్పారు.



అన్నాన్ని ఉడికిస్తున్న సిబ్బంది

స్టార్ హోటల్‌ను తలపించే వంటశాల...

ఆస్పత్రిలోని వంటశాల కూడా స్టార్‌హోటల్ కిచెన్‌ను తలపించేలా ఉంటుందని, ప్రతి ప్రాంతాన్ని శుభ్రంగా కడిగి శుభ్రం చేస్తున్నామని, ఇక వంటలకు ఫిల్టర్ వాటర్‌నే వాడుతున్నామని చెప్పారు. పాకశాలలో పనిచేసే సిబ్బంది చేతులకు గ్లోవ్స్, తలకు హెయిర్‌నెట్ క్యాప్‌లు ధరించి వంటలు తయారు చేస్తారని చెప్పారు. ఆ ఆస్పత్రి డీన్ తెరని రాజన్ మాట్లాడుతూ ప్రతిరోజూ 2500 మంది రోగులకు శుచికరమైన ఆహార పదార్థాలు అందించినందుకు రాష్ట్ర ఆహార భద్రతా విభాగం సర్టిఫికేట్ లభించడం, తమ ఆసుపత్రి పాకశాల సిబ్బంది శ్రమకు లభించిన గుర్తింపుగా భావిస్తున్నారు. ఈ సర్టిఫికేట్ పాకశాల నిపుణులు, న్యూట్రీషియన్లు, సిబ్బందికి మరింత ప్రోత్సాహాన్ని కలిగిస్తుందని, అదే సమయంలో భవిష్యత్తులో వారి బాధ్యతలను మరింతగా పెంచుతుందని ఆయన పేర్కొన్నారు.

రోగులు కాదు... కుటుంబీకులు

రోజుల తరబడి మందులు, సూదులు వేసుకుని చికిత్స పొందుతున్న రోగులకు వికటింపులకు తావులేని నాణ్యమైన ఆహార పదార్థాలను అందిస్తున్నామని చెప్పారు. వంటశాలలో పనిచేస్తున్నవారంతా ఆస్పత్రి ఉద్యోగుల్లా కాకుండా రోగులను తమ కుటుంబ సభ్యుల్లా భావించడం వల్లే వారికి శుచికరమైన, రుచికరమైన ఆహారపదార్థాలు అందుతున్నాయనడంలో ఏమాత్రం అతిశయోక్తి కాదని డీన్ అన్నారు.



సిద్ధమవుతున్న మాంసం, అన్నం

పురుషులు మాత్రమే పాల్గొనే ఆలయ వేడుకలు

పెరంబూర్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): పురుషులు మాత్రమే పాల్గొనే ఆలయ వేడుకలు కోలాహలంగా సాగాయి. మదురై జిల్లా తిరుమంగళం సమీపం అనుపంబట్టి కులదేవమైన కరుంపారై ముత్తయ్య ఆలయ వేడుకల్లో పురుషులు మాత్రమ పాల్గొనడం ఆనవాయితీ. ఈ వేడుకల్లో భాగంగా 3,000 కిలోల అన్నం, 1,000 కిలోల మేక, గొర్రె మాంసంతో భారీ పాత్రల్లో వంటకాలు సిద్ధం చేశారు. ఆలయ సమీపంలోని మైదానంలో చుట్టుపక్కల గ్రామాలకు చెందిన సుమారు 10,000 మంది పురుషులు విందు భోజనంలో పాల్గొన్నారు.



ఘనంగా టీఎన్‌ఏవీఎమ్మెస్ కార్నివాల్



విద్యా ఉపకార వేతనం అందుకున్న విద్యార్థినులతో నిర్వాహకులు, అతిథులు

ప్యారీస్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): నగరంలోని తమిళనాడు ఆర్యవైశ్య మహిళా సభ మద్రాసు యూనిట్ (టీఎన్‌ఏవీఎమ్మెస్) కార్నివాల్ వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. స్థానిక చెట్‌పెట్‌లోని కుచలాంబాళ్ కల్యాణ మండపం వేదికగా ఉదయం 10.30 గంటలకు జ్యోతి ప్రజ్వలన, ప్రార్థన అనంతరం టీఎన్‌ఏవీఎమ్మెస్ చైర్‌పర్సన్ కె.అనితా రమేష్ అధ్యక్షతన ప్రారంభమైన వేడుకలు మెరిట్ సాధించిన విద్యార్థులకు స్కాలర్‌షిప్ పంపిణీ, ఆలయాలకు విరాళాల అందజేత, కార్యదర్శి నివేదిక, భగవద్గీత శ్లోకాల పోటీలు, తంబోలా, జాస్వీ కరాటే విన్యాసాలు, క్విజ్, ఇంటింటి రామాయణం హాస్యనాటిక, సర్వంనాటక ప్రియ బృందంచే నాటిక ప్రదర్శన, అతిథులు, స్పాన్సర్ల సత్కారం, బహుమతుల ప్రదానం తదితర కార్యక్రమాలతో సాయంత్రం 6 గంటల వరకు సందడి నెలకొంది. ముఖ్య అతిథిగా ప్రముఖ నర్తకి లావణ్య వేణుగోపాల్ విచ్చేసి కార్నివాల్ వేడుకలను సమాజానికి ఉపయోగకరంగా నిర్వహించిన నిర్వాహకులను అభినందించారు. ముందుగా చైర్‌పర్సన్ అనితా రమేష్ మాట్లాడుతూ... తమ సంస్థ తరుఫున అనేక సేవా, వినోద కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్నివాల్-2025 వేడుకల్లో గీతా మందిరానికి రూ.25 వేలు, భానుమతి గుండె శస్త్రచికిత్సకు రూ.10 వేలు, ఇద్దరు మహిళలకు కుట్టు మెషిన్ల కోసం రూ.15 వేలు, ఎస్కేపీడీ ఆలయ స్వర్ణ రథ పథకానికి రూ.25 వేలు విరాళంగా అందజేసినట్లు తెలిపారు. గౌరవ కార్యదర్శి లక్ష్మీ కర్లపాటి వార్షిక నివేదికను చదివి, ఈ నూతన సంవత్సరంలో చేపట్టనున్న ప్రాజెక్టు కార్యక్రమాల గురించి వివరించారు. గౌరవ కోశాధికారి వసుంధర సుంకు పాఠశాల, కళాశాలలో మెరిట్ సాధించిన విద్యార్థులకు ఉపకార వేతనంగా రూ.2,15,000 అందజేసి అభినందించినట్లు తెలిపారు. ఈ వేడుకల్లో సభ్యులు తమ కుటుంబాలతో కలిసి పాల్గొని సందడి చేశారు. వైస్ ప్రెసిడెంట్ మల్లికా ప్రకాశ్ వందన సమర్పణతో కార్యక్రమం ముగిసింది.

కత్తిపార స్క్వేర్‌లో 'హ్యాండీక్రాఫ్ట్ ఎగ్జిబిషన్'

పెరంబూర్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హస్తకళల పరిశ్రమల అభివృద్ధి సంస్థ 'పూంపుహార్' ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి 'గాంధీ సిల్క్ బజార్' పేరుతో హస్తకళల ప్రదర్శన స్థానిక గిండి కత్తిపార స్క్వేర్‌లో ప్రారంభమైంది. ఈ ప్రదర్శనలో 70 స్టాళ్లు ఏర్పాటుకాగా, పంచలోహ విగ్రహాలు, రాతి శిల్పాలు, కొయ్య బొమ్మలు, ఇత్తడి దీపాలు, తంజావూరు చిత్రాలు ఉన్నాయి. అలాగే, కాగిత గుజ్జు, తోలు, సహజ ఫైబర్, తాటి నార, కొబ్బరి చిప్ప తదితరాలతో రూపొందించిన ఉత్పత్తులు, కళాత్మక నగలు, పూసల దండలు, చీర, చేనేత వస్త్రాలను ప్రదర్శిస్తున్నారు. ఈనెల 12వ తేది వరకు జరగనున్న ఈ ప్రదర్శనను ఉదయం 10 నుంచి రాత్రి 8 గంటలకు ప్రజలు వీక్షించవచ్చని, ఎలాంటి ప్రవేశ రుసుము లేదని నిర్వాహకులు తెలిపారు.



ఎగ్జిబిషన్‌లోని వస్తువులు ఆసక్తిగా చూస్తున్న ప్రజలు

రైతు పురుషోత్తంనాయుడికి అభ్యుదయ పురస్కారం



మంత్రి, ఎంపీ చేతుల మీదుగా అవార్డును అందుకుంటున్న రైతు పురుషోత్తం నాయుడు

రేణిగుంట, జనవరి 4(ఆంధ్రజ్యోతి) : రాస్ కేవీకే దత్తత రైతు పురుషోత్తం నాయుడుకు అభ్యుదయ పురస్కారం లభించింది. రామచంద్రాపురం మండలం మిట్టూరు గ్రామానికి చెందిన పురుషోత్తంనాయుడు వ్యవసాయంలో రాస్ కృషి కేంద్రం సూచనలతో ఆధునిక సాంకేతిక సమగ్ర వ్యవసాయ విధానం పాటిస్తూ పలువురు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆయన సేవలను గుర్తించిన గుంటూరు విజ్ఞాన్ విశ్వవిద్యాలయం, రైతు నేస్తం ఫౌండేషన్ సంయుక్తంగా శనివారం గుంటూరులో నిర్వహించిన సంక్రాంతి సంబరాలలో ఆయనకు అభ్యుదయ రైతు పురస్కారం అందజేశాయి. వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, ఎంపీ లావు శ్రీకృష్ణదేవ రాయులు చేతుల మీదుగా ఆయన ఈ పురస్కారం అందుకున్నారు. రాస్ చైర్మన్ డాక్టర్ ఎఎస్.వెంకటరత్నం, కేవీకే హెడ్ డాక్టర్ శ్రీనివాసులు తదితరులు రైతు పురుషోత్తం నాయుడును అభినందించారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో సినీ దర్శకుడు ఆదిత్య, మాజీ డీజీపీ ఆర్పీ ఠాకూర్, పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, తెలంగాణ ఎమ్మెల్యే నవీన్‌కుమార్ ఉన్నారు.


ఆదిత్య


ఆర్పీ ఠాకూర్- మురళీమోహన్


సర్వదర్శనానికి 8 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 8 గంటల సమయం పడుతోంది. శనివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 10కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

గురువారం నాటి హుండీ ఆదాయం : రూ.3.34 కోట్లు

శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు : 56,550

తలనీలాలు సమర్పించినవారు : 28,853



మహాక్షేత్రం : తిరుపతి గోవిందరాజస్వామి ఆలయం

అలసిన స్వామి!


ఆలయ గోపురం

ఏడు కొండలస్వామికి స్వయానా అన్న గోవిందరాజులు. కొండ మీద తమ్ముడికి భక్తులు నిలువు దోపిడీలు ఇచ్చి గోవిందలు పెడుతూ ఉంటే, కొండకింద ఉండే గోవిందరాజులు మాత్రం ఏడుకొండలస్వామికి వచ్చిన సొమ్మును లెక్కించి లెక్కించి అలసిపోయి, కుడిచేతిని తలకింద పెట్టుకుని పడుకుని ఉంటాడు.




గోవిందరాజస్వామి ఆలయం

తిరుపతి(కల్చరల్)

తిరుపతి పట్టణంగా ఉన్నపుడు.. ఎక్కడ నుంచి చూసినా ఆకాశంలోకి గర్వంగా తలెత్తి నిలబడి నేనున్నానన్నట్టుగా కనబడేది గోవిందరాజస్వామి గుడి గోపురం.

తిరుపతి నగరంగా మారినాక.. ఆకాశాన్ని తాకే బహుళ అంతస్తుల భవనాల నడుమ తొంగి చూస్తున్నట్టుగా కనిపించి మాయమవుతోంది ఈ మహాగోపురం.

దక్షిణ భారతదేశంలోనే పురాతన చారిత్రక ఆనవాలు గోవిందరాజస్వామి గుడి. తొలినుంచీ ఎందుకోగానీ తిరుమలలా, తిరుచానూరులా భక్తుల రద్దీ ఇక్కడ కనిపించదు. విశాలమైన ఆలయమూ, ఆదాయమూ ఉన్నప్పటికీ 15వ శతాబ్దం వరకూ ఈ ఆలయానికి పెద్దగా ప్రాశస్త్యం లేదు. శ్రీకృష్ణదేవరాయలు ఏడుమార్లు తిరుమలకు వచ్చినా, ఈ దారిలోనే శ్రీకాళహస్తికి వెళ్లినా గోవిందరాజులును ఎందువలననో దర్శించుకోలేదు. ఒక్క సాళువ నరసింగరాయలు మాత్రమే 1494 వరకూ ఈ ఆలయంపై శ్రద్ధ చూపించినట్లు తెలుస్తోంది. ఇదే ఆనవాయితీని ఇప్పటి పాలకులు కూడా కొనసాగిస్తున్నారు. తిరుమల కొండకు వచ్చే ప్రముఖులు, తిరుచానూరు అమ్మవారిని కూడా దర్శించుకుంటారు గానీ నగరం నడిబొడ్డున ఉండే గోవిందరాజస్వామిని మాత్రం దర్శించుకోవడానికి ఆసక్తి చూపించరు. అయినా సాధారణ భక్తులు మాత్రం, రైల్వే స్టేషనుకు ఎదురుగానే ఉండే ఈ ఆలయానికి వెళ్లి దర్శనం చేసుకుని వెళ్తుంటారు.



రాజగోపురం

ఇక గోవిందరాజస్వామిగుడి రాజగోపురాన్ని మట్ల కుమార అనంతరాయ అనే దేవచోళ కుటుంబానికి చెందిన రాజు క్రీ.శ. 1628లో నిర్మించారు. ఏడు అంతస్తులు, 50 మీటర్ల ఎత్తు ఉన్న గోపురం ఇది. గోపురం మీద రామాయణ ఘట్టాలను తెలిపే వందలాది శిల్పాలు ఉంటాయి.

గుడి నిర్మాణ చరిత్ర

క్రీ.శ.1130 తర్వాత ఈ ఆలయ నిర్మాణం 89 సంవత్సరాల పాటు పలు దశలుగా సాగింది. క్రీ.శ. 1219లో లోపలి గోపురం నిర్మాణం జరిగింది. అంచలంచెలుగా గుడి విస్తరణ జరిగింది. 1220న రామానుజ విగ్రహ ప్రతిష్ఠ జరిగింది. దాని తరువాత 230 సంవత్సరాలకు 1457లో మరికొన్ని నిర్మాణాలు జరిగాయి. 1330వ సంవత్సరం నుంచి ఈ ఆలయానికి సంబంధించిన అనేక దానశాసనాలు లభిస్తున్నాయి. ఇద్దరు ద్వార పాలకులను నంద్యాల నారప్పరాయ అనే వ్యక్తి 1549 మార్చి 18న ఏర్పాటు చేసినట్లు శాసనం ఉంది. అలాగే క్రీ.శ. 1219లోనే గోవిందరాజ ఆయంలో అఖండదీపం వెలిగించేందుకు వీరనరసింహరాయల రాణి 32 గోవులను సమర్పించింది. విజయనగర ఆలయ నిర్మాణ శైలిలో ఉండే ఈ ఆలయంలోని వసంత మండపాన్ని అహోబిల మఠానికి చెందిన వన శఠగోప జీయర్ క్రీ.శ.1494లో నిర్మాణం చేశాడు. అయితే ఇది పూర్తి కాలేదు. దీనిని ఆ తరువాత రెండువేల పణాల సొమ్ముతో నల్లార్ అంగాండి అనే వ్యక్తి పూర్తి చేసినట్లు ఆధారాలున్నాయి. నీరాళి మండపాన్ని పోటు సమీపంలో అప్పాపిళ్లై అనే వ్యక్తి క్రీ.శ.1506లో నిర్మించాడు. క్రీ.శ.1497 ప్రాంతంలో చిత్రకూట మండపం, క్రీ.శ.1542 ప్రాంతంలో లక్ష్మీ మండపం వాడుకలోకి వచ్చినట్లు ఇందుకు సంబంధించిన దాన శాసనాల ద్వారా తెలుస్తోంది. వేదాంగదేశికకుల సన్నిధికి సమీపంలోని నాలుగుకాళ్ల మండపం 1494లో నరస రాజ ఉడైవరులు కట్టించారు.

ఉపాలయాలు : ఈ ఆలయ ప్రాంగణంలో శ్రీకృష్ణుడు, గోదాదేవి (ఆండాళ్) ఆలయం, చక్రత్తాళ్వార్ (సుదర్శన చక్రం), విష్వక్సేనుడు, నమ్మాళ్వార్, కులశేఖరాళ్వార్, పెరియాళ్వార్, తిరుమంగైయాళ్వార్, మధురకవి ఆళ్వార్, తిరుమలనంబి, రామానుజులు, కురుత్తాళ్వార్, సాలై నాచ్చియారు (పుండరీక వల్లీతాయారు) వంటి ఆలయాలున్నాయి.

ఆలయ వేళలు: రోజూ ఉదయం 5 గంటల నుంచి రాత్రి 9 దాకా.

పూజలు, కైంకర్యాలు: తిరుమల తరహాలోనే సుప్రభాతం, తోమాల, అభిషేకం, ఏకాంత సేవలు జరుగుతాయి. టికెట్ ధరలు రూ.5 నుంచి రూ.20 దాకా మాత్రమే ఉంటాయి.

క్రీ.శ. 9,10 శతాబ్దాలనాటి కథ..

దక్షిణాదిలో శైవం పుంజుకుంది. విష్ణు ఆరాధనకు అడ్డంకులు ఏర్పడినాయి. అప్పటి చోళరాజు 1వ కుళోత్తుంగచోళుడు చిదంబరంలోని గోవిందరాజుల విగ్రహాన్ని ఆలయం నుంచి పెకిలించివేశాడు. హోయసల రాజ్యం (మైసూరు)లో ప్రవాసం ఉన్న రామానుజులు సూచనతో విగ్రహం తిరుపతికి చేరింది. అప్పటికే కపిల తీర్థానికి దక్షిణంగా ఉన్న కొత్తూరులో శ్రీపార్థసారథి ఆలయం ఉండేది. ఈ ఆలయ ప్రాకారంలోనే గోవిందరాజులకు ఒక గర్భగుడి నిర్మించారు. 1130 ఫిబ్రవరి 24న గోవిందరాజస్వామి విగ్రహ ప్రతిష్ఠ జరిగిందంటారు. అందువలన ఈ గుడి ప్రాంతాన్ని గోవిందరాజపురం అని పిలిచేవారు. తర్వాత దీనినే రామానుజపురం అని పిలిచేవారు. తిరుపతి అనే పేరు ఎప్పటి నుంచి వాడుకలోకి వచ్చిందో చెప్పే ఖచ్చితమైన ఆధారాలు లేవు.

ముఖ్యమైన ఉత్సవాలు

వార్షిక బ్రహ్మోత్సవాలు: మే-జూన్‌లో ఎనిమిది రోజులు జరుగుతాయి. నాలుగవ రోజు గరుడసేవ జరుగుతుంది.

తెప్పోత్సవాలు: ఫిబ్రవరి మూడవ వారంలో ఆరు రోజులు జరుగుతాయి.

ఇంకా.. జనవరి రెండవ వారంలో పదమూడు రోజులు అధ్యయనోత్సవాలు, ఇదే నెలలో గోదా పరిణయం, మార్చిలో సాలై నాచియార్ పంగుణి ఉత్సవం, జూలైలో జ్యేష్ఠాభిషేకం మూడు రోజులు, సెప్టెంబరులో పవిత్రోత్సవం మూడు రోజులు, ప్రతి నెలా పున్నమి గరుడసేవ జరుగుతాయి.


ఆలయ పుష్కరిణి

జోరుగా వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లు






స్వర్ణరథాన్ని ట్రయల్ రన్ చూస్తున్న అధికారులు - మహద్వార గేట్లను శుభ్రపరుస్తున్న సిబ్బంది - సెట్టింగుల కోసం తీసుకువచ్చిన సామగ్రి

తిరుమల శ్రీవారి ఆలయంలో వైకుంఠ ఏకాదశికి సంబంధించిన ఏర్పాట్లు జోరుగా సాగుతున్నాయి. జనవరి 10న ఏకాదశి, 11న ద్వాదశిని పురస్కరించుకుని 10 నుంచి 19వ తేదీ వరకు వైకుంఠద్వార దర్శనాలు జరగనున్నాయి. ఈ క్రమంలో భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని టీటీడీ తగిన ఏర్పాట్లు చేస్తోంది. ఆలయ గోపురం అలంకరణలకు లైట్లను సిద్ధం చేస్తున్నారు. అలాగే మహద్వారం గేట్లను ప్రత్యేక రసాయనాలతో శుభ్రపరుస్తున్నారు. ఇక, ఈ ఏడాది ప్రత్యేకంగా మైసూరు దసరా ఉత్సవాల్లో విద్యుత్, పుష్పాలంకరణలు చేసే ప్రత్యేక నిపుణులను తిరుమలకు రప్పించారు. వారు ప్రస్తుతం ఆలయం ముందు ప్రత్యేకంగా ఓ షెడ్‌ను ఏర్పాటు చేసి, సెట్టింగ్ నిర్మాణ పనుల్లో నిమగ్నమయ్యారు. ఏకాదశి సందర్భంగా నిర్వహించే స్వర్ణరథాన్ని కూడా అధికారులు సిద్ధం చేస్తున్నారు. శనివారం స్వర్ణరథాన్ని కొంతదూరం ముందుకు కదలించి పనితీరును పరిశీలించారు. ఇక భక్తులకు ఇబ్బంది లేకుండా నారాయణగిరి వద్ద పటిష్ఠమైన క్యూలు ఏర్పాటు చేస్తున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి


విద్యుత్ అలంకరణల కోసం సిద్ధం చేస్తున్న లైట్లు


ఏర్పాట్ల గురించి తెలుసుకుంటున్న టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు

ఏర్పాట్లను పరిశీలించిన చైర్మన్, ఈవో

వైకుంఠద్వార దర్శనం కోసం తిరుమలలో జరుగుతున్న ఏర్పాట్లను టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి శనివారం పరిశీలించారు. ముందుగా బాలాజీనగర్‌లోని కమ్యూనిటీ హాల్‌కు చేరుకుని అక్కడ స్లాటెడ్ సర్వదర్శన టోకెన్లు జారీచేసే కేంద్రాలను చూశారు. తర్వాత ఔటర్ రింగ్ రోడ్డు, కృష్ణతేజ రెస్ట్ హౌస్ వద్దనున్న క్యూలు, పార్కింగ్ ప్రాంతాలను పరిశీలించారు. అన్నమయ్య భవనంలో ఏర్పాట్లపై టీటీడీ, జిల్లా, పోలీసు అధికారులతో సమీక్షించారు. అనంతరం ఈవో శ్యామలరావు మీడియాతో మాట్లాడుతూ టికెట్లు, టోకెన్లు ఉన్న వారికే వైకుంఠద్వార దర్శనాలు ఉంటాయని మరోసారి స్పష్టం చేశారు. వీఐపీలు వచ్చే క్రమంలో ట్రాఫిక్ సమస్య లేకుండా తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. దాదాపు 7 లక్షల మంది భక్తులు వైకుంఠద్వార దర్శనం చేసుకుంటారనే అంచనా వేస్తున్నామని తెలిపారు. కాగా, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు తిరుపతిలోని పలు కేంద్రాల్లో ఏర్పాట్లను పరిశీలించారు.

అడవిలో దారితప్పిన విద్యార్థుల ఆచూకీ లభ్యం

- జలపాతంలో విద్యార్థి మృతి
- అడవిలో పోలీసులు, అటవీశాఖ సిబ్బంది గాలింపు
- అర్ధరాత్రి విద్యార్థులను కనుగొన్న పోలీసులు



రైల్వే కోడూరుకు చేరుకున్న విద్యార్థులు

రైల్వేకోడూరు/శ్రీకాళహస్తి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): శేషాచలం అడవిలో దారి తప్పిన విద్యార్థులను శుక్రవారం అర్ధరాత్రి 12.40 గంటలకు కనుగొన్నారు. గుంజన జలపాతం సమీపంలోని సుడిగుండంలో పడిన ఓ విద్యార్థి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు... శుక్రవారం ఉదయం 10 గంటలకు తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి పరిధిలోని పానగల్ ప్రాంతానికి చెందిన పెద్దేశుగారి సాయిదత్ (ఓపెన్ డిగ్రీ విద్యార్థి) (26), పట్నం గిరి (బీటెక్ విద్యార్థి), తమ్మన్నగారి కేదార్‌నాథ్ (బీటెక్ విద్యార్థి), వి.దినేశ్ (చెన్నైలో ఉద్యోగి), పి.దినేష్ (బీటెక్), ఇ.మోహన్‌క్రిష్ణ (డిగ్రీ విద్యార్థి)లు తమ స్వగ్రామమైన పానగల్ నుంచి రైల్వేకోడూరు మండలంలోని మాధవరంపోడుకు సుమారు 20 కిలోమీటర్ల దూరం శేషాచలం అడవిలో ఉన్న గుంజన జలపాతం వద్దకు రెండు మోటారు బైకుల్లో బయలుదేరారు. మాధవరం పోడుకు సమీపంలో ఉన్న వాగేటికోన మినీ రిజర్వాయర్ వద్ద మోటారు బైకులను పార్క్ చేసి అక్కడి నుంచి కాలినడకన గుంజన జలపాతం వెళుతుండగా నీటి ఒరవడి ఎక్కువగా ఉండడం, చీకటి పడడంతో జలపాతం వద్దకు వెళ్లలేకపోయారు. ఒక చిన్నపాటి కొండపై కూర్చున్నారు. ఇందులో సాయిదత్, మోహన్‌కృష్ణ, వి.దినేష్ జారి నీటి సుడిగుండంలో పడిపోయారు. కేదార్‌నాథ్, పి.దినేష్, గిరి నీటిలోకి దిగి మోహన్‌కృష్ణ, వి.దినేష్‌లను కాపాడారు. సాయిదత్ జాడ కనిపించలేదు. దినేష్ అక్కడి నుంచి పది కిలోమీటర్లు నడుచుకుని సెల్‌ఫోన్ సిగ్నల్స్ వచ్చే ప్రాంతానికి వచ్చి బంధువులు, 108కు సమాచారం అందించి లోకేషన్ పంపాడు. కొన్ని గంటల తర్వాత శవం నీటిపై తేలియాడింది. శవాన్ని బయటకు తీశారు. సమాచారం తెలుసుకున్న రైల్వేకోడూరు సీఐ కె.హేమసుందరరావు, రైల్వేకోడూరు ఎస్ఐ నవీన్‌బాబు, సిబ్బంది, అటవీశాఖ అధికారులు, సిబ్బంది కలసి అడవిలో గాలింపు చర్యలు చేపట్టి అర్ధరాత్రి 12.40 గంటలకు వారు ఉన్న చోటును కనిపెట్టారు. తెల్లవారుజామున 4.30 గంటలకు వారంతా రైల్వే కోడూరుకు చేరుకున్నారు. విద్యార్థులను రైల్వేకోడూరు పోలీస్‌స్టేషన్‌కు తీసుకుని వచ్చారు. సాయిదత్ శవాన్ని రైల్వేకోడూరు ప్రభుత్వ ఆస్పత్రిలో శవపరీక్ష కోసం తరలించినట్లు ఎస్ఐ నవీన్‌బాబు తెలిపారు. సాయిదత్ మృతితో పానగల్‌లో విషాదచాయలు అలముకున్నాయి. శ్రీకాళహస్తి శ్రీరామ్‌నగర్‌కాలనీకి చెందిన దత్తసాయి ఆధ్యాత్మిక వేదికల్లో డ్రమ్స్ వాయిద్యం చేస్తుండేవాడు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో ప్రతిరోజూ రాత్రి ఏకాంతసేవ సమయంలో స్నేహితులతో కలిసి డ్రమ్స్ వాయిద్యాన్ని ఉచితంగా చేసేవారు.


మృతిచెందిన సాయిదత్

పాఠశాలలో 24 మంది విద్యార్థినులకు అస్వస్థత




ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు - పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పులివర్తి నాని

చంద్రగిరి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): చంద్రగిరి ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 24 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. శనివారం మధ్యాహ్నం భోజనం చేశాక వాంతులు, విరేచనాలు కావడంతో వీరిని స్థానిక సీహెచ్‌సీకి తరలించారు. పాఠశాలలో 654 మంది చదువుతున్నారు. ఒకే ప్రహరీ ఆవరణలో జూనియర్ కళాశాల, ఉన్నత పాఠశాల ఉన్నాయి. తొలుత జూనియర్ కళాశాల విద్యార్థినులకు డొక్కా సీతమ్మ భోజనం పథకం కింద వంట చేశారు. ఆ వంట కార్మికులే తరువాత హైస్కూలులో భోజనం తయారు చేశారు. అయితే ఈ భోజనం సరిగ్గా ఉడకలేదని సమాచారం. పాఠశాల సమయం ముగుస్తుండటంతో హడావుడిగా ఈ అన్నం పెట్టారని విద్యార్థినులు చెబుతున్నారు. దీంతో స్వల్ప అస్వస్థతకు గురైన 24 మంది విద్యార్థులను చంద్రగిరి ఆసుపత్రికి తరలించి, వైద్య సేవలు అందించారు. ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీనివాసరావు, చంద్రగిరి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అరుణలతో కలిసి బాధిత విద్యార్థినులను ఎమ్మెల్యే పులివర్తి నాని పరామర్శించారు. మెరుగైన చికిత్స అందించాలని ఆదేశించారు. కాగా వంట కార్మికులపై గతంలో ఫిర్యాదులు వచ్చాయి. గత వైసీపీ ప్రభుత్వంలో రాజకీయ ఒత్తిళ్లతో తొలగించలేదు. వీరి నిర్లక్ష్యం వల్ల చాలాసార్లు భోజనం చేయడంలేదని విద్యార్థినులు ఆరోపిస్తున్నారు.

కలెక్టర్‌కు మంత్రి సవిత ఆదేశం

తిరుపతి(కలెక్టరేట్), జనవరి 4(ఆంధ్రజ్యోతి): విద్యార్థినులకు మెరుగైన వైద్యం అందించాలని మంత్రి సవిత కలెక్టర్ వెంకటేశ్వర్‌ను ఆదేశించారు. విషయం తెలుసుకున్న వెంటనే కలెక్టర్‌తో మంత్రి ఫోన్‌లో మాట్లాడారు. అస్వస్థతకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.


జ్యోతి ప్రజ్వలన చేసి, సదస్సును ప్రారంభిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

పర్యాటక, ఆధ్యాత్మిక రంగాల అభివృద్ధికి సూచనలు ఇవ్వండి

- మైస్ టూరిజం కాన్ఫరెన్సులో కలెక్టర్ వెంకటేశ్వర్

ఏర్పేడు, జనవరి 4(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పర్యాటక, ఆధ్యాత్మిక రంగాలకు మంచి ప్రాధాన్యత ఉందని, వాటిని మరింత అభివృద్ధి చేసేందుకు సూచనలు, సలహాలు ఇవ్వాలని కలెక్టర్ వెంకటేశ్వర్ కోరారు. ఐఐటీ కళాశాల క్యాంపస్‌లో శనివారం ఆంధ్రప్రదేశ్ టూరిజం అథారిటీ జిల్లా పర్యాటక కౌన్సిల్ తిరుపతి ఆధ్వర్యంలో జిల్లాలో మైస్ పర్యాటక రంగంపై ఒకరోజు సదస్సు నిర్వహించారు. పలు యూనివర్సిటీల వీసీలు, విద్యావేత్తలు, పారిశ్రామికవేత్తలు, కార్పొరేట్ రంగ ప్రతినిధులు హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మైస్ టూరిజం అభివృద్ధికి గల అవకాశాలు,అనుసంధానం తదితర అంశాలపై ప్రణాళికలు తయారు చేయాలన్నారు. జిల్లాలో 75 కిలోమీటర్ల నిడివి గల సముద్ర తీరం, ఆరు బీచ్‌లు, పలు పర్యాటక, ఆధ్యాత్మిక క్షేత్రాలు ఉన్నాయని,వాటి అభివృద్ధిపై సూచనలు,సలహాలు ఇవ్వాలని కోరారు. ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ మాట్లాడుతూ తిరుపతి జిల్లాలో ఐఐటీ, ఐజర్, సంస్కృత కళాశాలలు,పలు యూనివర్సిటీలు ఉన్నాయని, తద్వారా యువతకు ఉపాధి అవకాశాలు పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రొఫెసర్ వెంకట్రావు, వినోద్‌గోపాల్, తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ మౌర్య పాల్గొన్నారు.

అంధుల క్రికెట్ పోటీల విజేత తిరుపతి

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): అంధుల రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీల్లో తిరుపతి జట్టు విజేతగా నిలిచింది. లూయిస్ బ్రెయిలీ జయంతిని పురస్కరించుకుని అంధ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు నిర్వహించారు. స్థానిక ఆర్డీటీ స్టేడియంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న పోటీలు శనివారం ముగిశాయి. ఫైనల్ పోటీల్లో విశాఖపట్నంపై తిరుపతి జట్టు గెలిచి టోర్నీ విజేతగా నిలిచింది. స్థానిక రామ్‌నగర్‌లోని యాదవ కల్యాణ మండపంలో శనివారం లూయిస్ బ్రెయిలీ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ లూయిస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం క్రికెట్ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో భారత అంధుల క్రికెట్ జట్టు కెప్టెన్ అజయ్‌రెడ్డి, మీనాక్షమ్మ ఫౌండేషన్ అధ్యక్షుడు వెంకటరమణ, లేడీస్‌క్లబ్ సభ్యురాలు శ్రీదేవి, వైద్యులు భవాని, పీఓసీ రమణ, అంధుల ఉద్యోగ సంఘం రాష్ట్ర కార్యదర్శి జలంధర్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు వెంకటనారాయణ, కార్యదర్శి సాజియతీ తదితరులు పాల్గొన్నారు.


తిరుపతి జట్టుకు బహుమతి అందజేస్తున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ